# ఆకులు రాలే కాలం

మసక చీకట్లో ఆమె మిలమిల మెరుస్తూన్నట్టు కని పిస్తుంది. అలాంటి ఛాయ ఆమెది. 'మరో పది నిమిషాల్లో చంద్రోదయం అవుతుంది' అంది, చాలాసేపటినుంచి నిశ్శబ్దంగా వుండిపోయిన వసంత.

ఇరవై గజాల అవతల పెద్దశబ్దం లేకుండా తల్లిలాగ వెళుతోంది నది. ఎన్నాళ్ళయినా ఆ నది నాకు గంగ-వీళ్ళేం పేరుతో పిలిచినా. అదే మహానది.

ఆ చిక్కటిచీకట్లో నదికూడా మెరుస్తోంది.

'చలి వేస్తోంధా?' అన్నాను అప్పటిదాకా నీటిమీద నిలుపుకున్న కళ్ళని తిప్పుకుంటూ.

'లేదు...నీకు?'

'కొంచెం'

'లోపలికి పోదామా? అక్క ఎదురు చూస్తూ ఉంటుంది.'

'నీఇష్టం-'

వసంత ఎలాగో నిట్టూర్పూ, నవ్వూ కలిపింది.

'నీ ఇష్టం అంటావు. నీకే ఇష్టంలేదా రామ్'

నవ్వుదామనుకున్నాను. కాని సందేహంగానే మమ్మల్ని ధరిణీ గుండెల్లో దాచుకున్న మసక చీకటీ, దూరంనించి మమ్మల్ని చూస్తూ గుసగుస లాడుతూన్నట్టున్న చిన్న చిన్న నక్షత్రాలూ, సాహసించి మమ్మల్ని చుట్టుకుంటూన్న గాలీ- వీటన్నిటినీ క్షమిస్తోన్నట్టు ప్రవహించి వెళ్ళిపోతూన్న గంగా, అన్నీ కలసి నన్ను నవ్వకుండా చేశాయి. ఆ సౌందర్యాలమధ్య నాప్రాణంకన్నా విలువైన వసంత పక్కనఉండి నవ్వేశక్తి తెచ్చుకుందును...కాని, నాలో దాగిన ఎన్నో అనుభూతుల శృంఖలాలు నన్నసలే నవ్వనియ్యలేదు. కవచం ధరించినవాణ్ణి ముళ్ళంచేస్తాయని ?

'నీ నిశ్శబ్దం అవధులు చేరుతోంది రామ్! నా మాటలు కూడా నిన్ను బాధ పెడుతున్నాయా?-అలాగే మాట్లాడ కుండా కూర్చోడం నాకు చేతకాదు రామ్! క్షమిస్తావు అని ఆశ. ఇంతకుముందు నమ్మిక ఉండేది. ఇప్పుడు —సారీ!...'

హటాత్తుగా ఆగిపోయింది వసంత.

పచ్చికబీడులోనుంచి చెట్లమధ్యనుంచి గాలిలో తేలివస్తు న్నట్లుంటుంది వసంత కంఠస్వరం. నీటిమీద తేలివొస్తున్న మురళీ ధ్వనుల్లాగ ఉంటుంది నాకు- ఆమె మాట్లాడితే.

'ఎందుకని వసంతా, ఆగిపోయావు'.

నిమిషం ఆమె మాట్లాడలేదు.

'కోపం వచ్చిందా?'

'నీమీద కోపం తెచ్చుకోగలిగితే, సుఖపడుదును రామ్ అది చేతగాకనే'...

మళ్ళీ ఆగిపోయింది. ఆ తియ్యటి కంఠస్వరంలోకి నా గొంతుక కలపాలని ఉండదునాకు.

'ఏమిటి వసంతా? చెప్పు.' అన్నాను సానునయంగా. ఆమె బాధపడితే నీళ్ళలో మునిగిపోతూన్నట్టు ఉంటుందినాకు.

'ఏమీలేదు రామ్!...నీకుచెప్పి ప్రయోజనంలేదు.

తడితడిగా ఉన్నదుఃఖపు జీరవొచ్చింది ఆమెగొంతు లోకి- ఉండీఉండీ ఆనది ఒడ్డుమీదకొచ్చి త్వరత్వరగా హద్దు లోకి వెళ్ళిపోయాక ఆ చుట్టుపక్కల నేలాఅలాగే, తడితడిగా ఉంటుంది.

ఆ మాట అన్నాను- వసంత పక్కన ఉంటే నా ఆలో చనలు నావి ఒక్కడివే కాదు.

'అవునురామ్! ఆ నేలమీద పాదాలమోపి నడవడం ఎంతోఇష్టం నీకు.

అదీ నిజమే కాని, వసంత మాటలకి అర్థం సూటిగానే తెలిసింది నాకు.

"ఆ మాట నిజంకాదు వసంతా!...నీకూ తెలుసును" అన్నాను. బహుశా దెబ్బతిన్నబాధ దాచుకోలేక పోయాననుకుంటాను.

డెక్ కుర్చీలో ఒంగిన తీగలాగ కూర్చున్న వసంత ఒక్కసారిలేచి చెరకు కర్రలాగ నిలబడి నాపక్కకు వచ్చింది. సున్నితమైన పరిమళాలు ఆమెతోటే వొచ్చాయి.

నా కుర్చీ చేతిమీద కూర్చుని తల నిమురుతూ, 'నాకు తెలుసును రామ్!...కాని, నీ హృదయానికి వేసుకున్న తాళాలు తియ్యాలని ఎన్ని పద్ధతులైనా ప్రయత్నిస్తాను. కాని దేనికీ లొంగవు నువ్వు' అంది.

"అలాటి తాళం ఏదైనా ఉంటే, ఏనాడో పోగొట్టుకున్నాను వసంతా!" అన్నాను. ఆమె అంత సన్నిహితంగా ఉన్నా, ఉక్కిరి బిక్కిరిగా ఉండదు నాకు. ఈ చల్లటిగాలిలో ఆమె సున్నితమైన వెచ్చదనం- బాధపడే మనసుకి ఆమె ఒక ఉపహారం.

"లేదురామ్! అదికాదు"

'మరి?'

'ఆతాళం నీదగ్గరే ఉంది. నువ్వు మరిచిపోయావు.'

నేనేమీ అనలేదు. ఆమె మాటల్లోని తీవ్రత నాకు ఆశ్చర్యంగా ఉంది.

చెదిరిన నాతలని సరిచేస్తూ, 'ఎంత ఒత్తుగా ఉంది నీజుత్తు! ఏ ఆడపిల్లయినా, ఇలాటి జుత్తుకోసం ఎంతో తపించిపోయేది!' అంది వసంత.

నాకు నవ్వొచ్చింది.

'నీ కలాటితపస్సు అవసరంలేదులే!' అన్నాను.

'బ్రతికిపోయాను! కాని, నాతపస్సు నేనూ చెయ్యాలి, రామ్!'

'అదేంకాదు- నీభ్రమ. అంతే.'

'కాదు-కాదు? నాతపస్సుమరీకష్టం. చూడని,కనిపించని దేవుళ్లకన్న, చూసి, కనిపించీ గుడ్డిగా ఉండిపోయే దేవుళ్లని మెప్పించడం కష్టంకాదూ రామ్!' అంది లాలనగా వసంత.

'నువ్వు నా ప్రాణానివి వసంతా!' అన్నాను నిజంచెప్తూ

"అవును. రామ్! నాకదిచాలదు...నీ మనస్సుని ఐపోవాలి" అంది చేతులుకట్టుకుని నక్షత్రాలవైపు చూస్తూ.

'అదీ అవుతావు వసంతా!...కాని నువ్వు పొరపాటు చేశావు. నేను-'

నిలబడి చెవులు మూసుకుంది వసంత.

"చెప్పకు. చెవులు చిల్లులు పడతాయి."

"కాని అదినిజం—"

"నీకళ్లలోనుంచి...ఎక్కడో చీకట్లో దాచుకున్న నీ మనస్సుకి- అదినిజం రామ్! నేనూ ఆలోచించగలననీ, నాకూ విచక్షణ ఉందనీ, ఎప్పుడైనా అనుకున్నావ్?"

"వసంతా!-"

"అబద్ధాలు మొదలుపెట్టకు. కనీసం, ఈ పవిత్రపరిసరా లని వొదలి అటువెళ్లేదాకా, నిజాలినాకక్కర్లేదు...నీ పద్ధతిలో నువ్వూ నాకక్కరలేదు."

'ఆవేశపడకు వసంతా'...

'అవును. నీలాగ, చెట్టునరికిన మొదలులాగ కదలకుండా ఉండాలి. ఏం? ఆ కొండమీద రాయిచూడు! రూపం కోతిలాగ ఉన్నా నిశ్చలంగా ఉండిపోయింది ఎప్పటినించో అలాగ, కాదూ?'

'సారీ వసంతా...'

'నాకోసం బాధపడకురామ్! మనస్సు ఇవ్వలేక ఒకసారి బ్రద్దలు కొట్టుకున్నాను. తీసుకోలేక మరొకసారి అది శిధిలం చేసుకుంటాను. నీకేం? నీ ఆలోచనలూ, తియ్యటి బాధలూ వెచ్చగా కప్పుకుని నిద్రపోగలవు నువ్వు. అవే ముళ్ళలాగ గుచ్చుకుంటాయి నాకు- ఏం అదృష్టం రామ్, నీది, నాది!'

ప్రచండమైన తీవ్రతతో, ఆక్రోశంలాగ ప్రారంభించి రాగాలాపన పూర్తిచేసినట్టు చిన్న స్వరంలో ముగించింది వసంత. ఆమె రెండడుగుల దూరంలో ఉన్నా. ఆ వేడి భరించరాని దానిలాగ అనిపించింది నాకు.

లేచిఆమెదగ్గరగావెళ్ళి అనునయిద్దామని అనుకున్నాను. కాని, నీరసంగా ఉంది...లేవలేనంత నీరసం. ఎందుకనో! ఆ నక్షత్రాలూ, భూతాల్లాగ చుట్టూ రక్షణ ఇస్తోన్న చెట్లు, సాగిపోతోన్న ఆ నదీ నాశక్తిని తీసుకోలేదు- నాకు తెలుసు కాని ప్రజ్వలిస్తోన్న వసంత నన్ను శారీరకంగాకూడా శక్తిహీనుడిగా చేసింది.

ఆమె మరికొంచెం అవతలకి వెళ్ళి ఎటోచూస్తూ నిలబడింది: అప్పుడే నదికవతల ఆకాశంలో తెలుపు వొస్తూ వొస్తూ

ఉంది, చంద్రోదయానికి ముందర కబురుగా. ఆ కాంతిలో నీడ లాగ నిలబడింది వసంత అలే చూస్తూ.

'ఇలాగ రా, వసూ?' అన్నాను.

'నేను రాను- నీదగ్గరికి వొస్తే ఈ కోపం అంతా మరిచి పోవాలి' అంది ధృడంగా వసంత.

'ఐతే-మరేం?'

'అందుకే నాకోపం పోవాలని లేదు...ఈ బాధలోనే నాకు ఉపశమనం'. అంది వసంత.

అందులో ఎంతనిజం ఉందో అప్పుడు తెలియలేదు. ఆ నిజం తెలిసేసరికి నిజంఏదో, కానిదేదో తెలుసుకోలేని స్థితిలోకి వొస్తాననీ తెలియలేదు. ఇదంతా నదీప్రవాహం లాంటిది. ఏ బిందువు ముందో, వెనకది ఏదో ఏ బిందువుకి తెలుస్తుంది?

'నే నిక్కడికి వొచ్చి ఉండాల్సింది కాదు' అన్నాను- కొంత పశ్చాత్తాపంతో.

'అవును. నన్ను పెట్టే వెయ్యిబాధల్లోనూ నువ్వు ముఖం తిప్పకోడం ఒక్కటే ఉండిపోయింది...బహుశా ఏ పవిత్ర స్త్రీతో నీకోసం కబురుపెట్టడం మరిచిపోయి ఉంటుంది, లేకపోతే, ఎందుకని వొచ్చావు?' అంది వసంత- ఈసారి రాసిన పంక్తులు చదువుతూన్నట్లు మాట్లాడింది.

'ఎక్కడ ఉన్నా, మనసు నీమీదే ఉంటుంది వసూ! అందు కని' అన్నాను. అందులో బురదా, నీరూ కలిసిన నదీ జలంలో లాగ కలిసి ఉన్న సత్యమూ, అసత్యమూ నన్ను కలవర

పెట్టేయి. వసంత జవా బివ్వదేమోననే క్షణికమైన ఆశ ఆమె మాటలముందు, గాలిముందు తెల్ల మేఘంలాగ, పారిపోయింది.

'ఇక్కడ ఉన్నది నీ శరీరం మాత్రమే, రామ్! అది ఎందుకు నాకు?...అందంగా చెప్పినంత మాత్రాన అబద్ధం నిజం కాదు' అంది వసంత.

చంద్రుడు నిండుగా, మెల్లిగా, తూర్పున తొంగి చూస్తున్నాడు. మసక చీకట్లో మసక నీడల భూతాలు రూపం తెచ్చుకుంటున్నాయి.

'నా దగ్గరకి రా, వసూ!' అన్నాను.

ఆ కొంచెం దూరమూ, వెయ్యి గొంతుకల ఆ ప్రశాంతతలో యోజనాల్లాగ బాధించింది నన్ను.

వసంత వొచ్చి కుర్చీ చేతిమీద కూర్చుని, 'నువ్వు మరీ పిల్లవాడివి రామ్! విచక్షణ వొచ్చే వయసు ఎప్పుడు వొస్తుంది నీకు?' అంది.

ఆమెని దగ్గిరగా తీసుకున్నాను-ఓదార్పుగా. భయాన్నించి ఇచ్చే అభయంగా.

'నా వయస్సు నీకు చెప్పేనా వసూ?' అన్నాను, భయపడుతూ.

'ఆఁ! రెండేళ్ళలో నలభై అని లక్షసార్లు చెప్పేవు. నన్నూ చెప్పనీ...నాకు ఇరవై రెండు-అంతే. ఇంకా నిండ లేదు. సరేనా?' అంది, వసంత నవ్వుతూ. చీకట్లు త్వరత్వరగా విడిపోతున్నాయి. మర్నాడు పూర్ణిమ అనుకున్నాను.

'నవ్వేంత తేలిక పరిస్థితి కాదది వసూ !' అన్నాను.

'పోనీ! వృద్ధుడి ప్రణయం చూసి నవ్వనీ!' అంది వసంత.

ఈ యువతిలో నా ఆలోచనల్ని ఎలాగ ప్రతిష్ఠించడం?

'అది కొంత నిజం!' అన్నాను, ప్రయత్నించి.

'ఏళ్లు వొచ్చాయి నీకు రామ్! కాని మనస్సు ఎదలేదు. కళ్లూ అంతే! ఐనా, ఏం మనిషివి? నిన్ను చూస్తే ముప్ఫయి దాటినట్టుండవు. నిజమైన వయసు చెప్తే నీకు వధువు ఎలాగ దొరుకుతుంది?' అంది మళ్లీ నవ్వుతూ వసంత.

ఇద్దరమూ మాట్లాడలేదు. ఆ స్థలమూ, ఆ పరిసరాలూ, ఆ సమయమూ కలలాగ ఉన్నాయి. ఆ చల్లటి వెన్నెలగాలిలో వెన్నెల విగ్రహంలాగ ఉన్న వసంత అత్యంత సాన్నిహిత్యం మాటల అవసరం లేకుండా చేసింది. భావనలు మనసునించి మనసులోకి ప్రవహించే స్వప్నాల నిమిషా లవి. అంతరంగాలు కరిగి కరిగి ఒకటైపోయే మాయ అది.

కావి, కవాటాలు-

ఆమె హృదయంలో, నా హృదయంలో, కవాటాలు-తాళాలు పోయిన కవాటాలు. అవి ఎప్పుడో తెరుచుకుంటాయో?

నా హృదయంతో ఆమె హృదయం కలిసి స్పందిస్తోంది. ఆ స్పందనలో ఉద్వేగమేకాని ఉద్రేకంలేదు. మనసులు కలుసుకోలేని ఉద్వేగం అది; ఆ నిశ్శబ్దంలో, ఆ మధుర సాన్నిహి

త్యంతో మమ్మల్ని దూరంగా ఉంచి, కనపడకుండానే మా ఇద్దరిమధ్యా నిలబడ్డ ఉద్వేగం.

ఆమె వెచ్చటి కన్నీళ్లు నాగుండెలమీద పడుతున్నాయి-గుండె కరగించే ప్రయత్నం చేస్తూన్నట్టు; పసిపాపని లాగ ఓకొట్టాను వసంతని-నిజానికి ఆమె పసిపాప నాదృష్టిలో.

అలాగ ఎంతసే పయిందో ఎవరికి తెలుసును? మే మీ లోకంలోనూ, కాలగమనంలోనూ ఉంటేకదా!

ఒక్కసారి అతి కాంతివంతమైన రెండు కాంతికిరణాలు మా మీదని పడ్డాయి.

కర్కశంగా, క్రూరంగా, కారుహారన్ రెండుసార్లు ధ్వనించింది. తరవాత మళ్లీ వెన్నెల, నిశ్శబ్దం.

చెట్టుకి అల్లుకున్న తీగలాగ కష్టంగా, అనిష్టంగా వసంత లేచింది. ఆమె చెయ్యి నా చేతిలో ఉంది.

విడిపించుకుని, ముఖం తుడుచుకుని, 'త్వరగా రా, రామ్!' అని వసంత వెళ్లిపోయింది.

కొన్ని అవయవాలే బలవంతంగా తీసివేసినట్లయింది నాకు. అక్కడినుంచి లేచి ఆ ఏభై గజాల దూరం నడవగలుగు తాననుకో లేదు,

కాని, వెన్నెల బాగా వొచ్చేసింది, వెక్కిరిస్తూ. నదిలో అక్కడా అక్కడా వెండిపోత కనిపిస్తూంది. నవ్వుతూ. ఆ ఏకాంతంలోని నిశ్శబ్దపు గోల భరించరానిదై పోయింది.

లేచి వెళ్ళేను నెమ్మదిగా.

నాగదికి వెళ్లడానికి మెట్లెక్కుతూంటే శ్రీనివాస్ కని పించాడు.

గడిచిపోయిన ఆ నిమిషాల తరవాత ఈ లోకంలోకి రావడమే కష్టమనిపించింది. మనుషుల్తో మాట్లాడ్డం మరీ అనిష్టం అనిపించింది.

తల వొంచుకుని మెట్లు ఎక్కి నా గదివంక వెళ్ళబో యాను. కాని శ్రీనివాస్ నా దారికి అడ్డంగా నిలబడ్డాడు.

'మీరు నన్ను క్షమించాలి!' అన్నాడు చేతులు జోడిస్తూ. అతను నన్ను స్పర్శిస్తే ప్రాణం అక్కడే పోయే లాగ ఉంది నా స్థితి.

'ఎందుకని?' అన్నాను పొడిగా; నాకు ఆ మాటలు బోధపడక.

'వొచ్చాక మీ కారు చూసి గాని. మీరు వొచ్చినట్టు తెలియలేదు...'

నా కర్థంకాలేదు. నా ఆలోచన అక్కడ ఉంటేకదా! తెల్లబోయి చూశానమకుంటాను.

'నా కారు దీపాలు మిమ్మల్ని చిరాకుపెట్టే యనుకుం టాను-క్షమించండి.'

వసంతతో నా చివరి క్షణాలు జ్ఞాపకం వచ్చాయి. ఆమె నన్ను వొదిలి వెళ్ళడం తలుచుకున్నాను.

ఎప్పుడో, ఎలాగో ఆమె నన్ను వొదిలి వెళ్ళిపోతుంది గదా! శ్రీనివాస్ కాని, అతని కారు దీపాలు గాని ఏం చేశాయని ?

'మరచిపొండి' అన్నాను, అడుగు వేస్తూ.

'ధన్యవాదాలు......వసంతతో కూడా చెప్పండి-లతకి తెలిస్తే నా ప్రాణం తీస్తుంది'.

'మీరే చెప్పండి'.

'ఆమెకి నా మాట రుచించదు—'.

ఇది మళ్లా అగమ్యం ఐపోతోంది. అయినా, ఒక్క తప్పుకి, సందేహాకరం ఐన తప్పుకి, ఇన్ని క్షమాపణలా !

'అలాగేలెండి' అన్నాను.

మళ్లీ నాదారికి అతను అడ్డువొస్తే అతన్ని తన్నడమో నేను మూర్ఛ పోపడమో జరిగేది. కాని, అతను తొలగి వెళ్లి పోయాడు.

నా గదిలోకి వెళ్లేను.

వేణ్నీళ్లు సిద్ధంగా ఉన్నాయి-తువ్వాలూ, సబ్బు. నా బట్టలూ అన్నీ. తెచ్చుకోవడం మరచిపోయిన ఉడికలాంకూడా ఉంది.

ఏదీ మరచిపోయే మనిషి కాదు వసంత. కాని. ఆమె కొన్ని విషయాలు మరచిపోతే బాగుంటుంది.

భోజనాలగదికి నేను వెళ్లేసరికి వాళ్లు ముగ్గురూ-శ్రీనివాస్, లత, వసంత, నాకోసం ఎదురు చూస్తున్నారు.

"ఆలశ్యం ఐంది, క్షమించండి," అన్నాను.

లత వసంతని క్రీగంట చూసి నవ్వుతూ, "ఒక్కొక్క ప్పుడు ఎదురు చూడడమూ బాగుంటుంది" అంది.

వసంత తల వొంచుకుని ప్లేట్లు, చెమ్చాలు సర్దుతోంది. కొత్తగా ఉంది నాకు ఆమె. అప్పుడూ అప్పుడూ ఆమె నాకు గంగా నదిలాగ కనిపిస్తుంది, మాటిమాటికి రూపం మారుతూ ఆమెలో నూ ఎప్పుడూ సౌందర్యం కనిపిస్తూనే ఉంటుంది.

అంత ఆకలిగా ఉందనుకోలేదు. మధ్యాహ్నం సరిగా తినక, ఆ పరిసరాల్లో చక్కటి ఆ చోట ఎప్పుడూ లేనంత తిన్నాను.

"అలాగ తిరిగి వద్దామా?" అన్నాడు భోజనంఅయాక శ్రీనివాస్.

నాకు వెళ్లాలనివుంది, వొద్దనీవుంది. ఆ వెన్నెల్లో నది ఒడ్డునే తిరిగివొస్తే, వొంటికీ మనస్సుకీకూడ ఆరోగ్యం- తేలిక పడతాయి. కాని, శ్రీనివాస్ సహచర్యం కారణం లేకుండానే అనిష్టం ఐపోయింది.

లత, వసంత లోపలికి వెళ్ళిపోయారు.

నా అకారణమైన అనిష్టాన్ని అదుపులోపెట్టి "పదండి" అన్నాను.

పోర్టికోలో టైము చూసుకున్నాను. తొమ్మిది దాటు లోంది.

"కారులో పోదామా?" అన్నాడు శ్రీనివాస్.

నవ్వి, "వొద్దు. నడుద్దాం" అన్నాను. వొందగజాలు ఎవరమూ మాట్లాడలేదు. అతను దయతో చివరిదాకా అలాగే ఉంటాడనే ఆశ మొలకెత్తింది నాలో.

చుట్టూ ప్రశాంతంగా ఉంది. వెన్నెల ఎంతో అందంగా పరిసరాలన్నిటికీ పూతపూసింది. మహానగరంనించి దూరంగా, ఈ శుభ్రంలో, నిశ్శబ్దంలో, వెన్నెలలో మరో లోకంలోకివచ్చి నట్టనిపించింది నా వెనకాలే అడుగులో అడుగు వేస్తున్నట్టు నడుస్తూన్న శ్రీనివాస్ ఒక్కసారి తృళ్లిపడేలాగ కేకవేసి ఎగిరేడు.

"ఏమిటది?" అన్నాను ఆలోచనల నిద్రనించి కర్కశంగా మేలుకొంటూ.

"పాము మీముందునించే జరజరా పాకి వెళ్లిపోయింది" అన్నాడు శ్రీనివాస్, కంగారుగా.

జాగ్రత్తగా చుట్టూ చూశాను.

"ఏమీ లేదే!" అన్నాను.

"నా కళ్లతో చూస్తేనే! ఇంత ఉంది!" అన్నాడు శ్రీనివాస్ రెండు చేతులూ బలంగా జాచి.

"చిన్న కొండచిలువ అయిఉంటుందిలెండి, అడివికదా! అవేమీ చెయ్యవు" అన్నాను, ముందుకి సాగుతూ.

అతను తటపటాయించి, "ముందుకి వెళ్లినకొద్దీ ఇంకా ప్రమాదం శివరామ్‌గారూ! వెనక్కి పోదాం" అన్నాడు.

అతనికి పాములంటే విపరీతమైన భయంలాగ ఉంది. నాకు భయం ఉంది కాని, జీవితంలో అన్ని భయాలకీ భయ పడే భయం లేదు.

"పోనీండి- మీరు వెనక్కి వెళ్లండి. నేనలాగ తిరిగి వొస్తాను" అన్నాను.

"మీరొక్కరూ..."

"నేనంటే పాములకి భయంలెండి... నాపేరు తెలుసుగా" అన్నాను నవ్వుతూ.

శ్రీనివాస్ దూరంగా కనిపిస్తోన్న ఇంటి దీపాలవైపు సందేహంగా చూసి, "సరే మీరు జాగ్రత్తగా ఉండండి" అని, వెనక్కితిరిగి నడవసాగేడు. ఆ నిశ్శబ్దంలో కావాలని అతను బలంగా వేస్తోన్న అడుగుల శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది చాలా సేపటిదాకా.

అనుకోకుండా ప్రాప్తించిన ఈ ఏకాంతం నాకు ఒక్కసారి బలం ఇచ్చింది. సన్నటి బాటకి రెండుపక్కలా నిలబడి చెట్లు చేతుల్తో పిలిచినట్టు అనిపించింది.

ఎంతసేపలాగ నడిచేనో! పెద్దపెద్ద ఈ చెట్లు నన్ను స్వర్గానికి దగ్గిరచేస్తాయి. వందల సంవత్సరాల అనుభవాలు దాచుకుని నాకోసం ఎదురుచూస్తూ అవి నన్ను ప్రకృతిఒడిలో జోకొడుతున్నట్లు ఉపశమనం ఇస్తాయి.

అర్థరాత్రి దాటుతూంటే తిరిగి వొచ్చి, నిశ్శబ్దంగా మెట్లెక్కాను, ఎవరికీ నిద్ర పాడుచెయ్యకూడదని. కాని, నా

ప్రయత్నం అనవసరం ఐపోయింది. నా మంచంవారన రెండు చేతుల్లోనూ తల పెట్టుకుని తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చున్న వసంత నన్ను చూసి ఒక్కసారి లేచి కౌగిలించుకుంది. ఆమెగుండె దడదడ లాడుతోంది.

"రామ్! రామ్!"

అస్పష్టంగా ఏదో అంటోంది వసంత. భావోద్రేకంలో, అనవసరమైన ఉద్వేగంలో, ఆమె చిన్నపిల్లలాగ కనిపించింది.

అనునయించాను నా శక్తికొద్దీ.

"ఏమయింది వసూ? ఏమయింది?"

చాలాసార్లు అడిగాను. ఆమె మాట్లాడేస్థితికి వచ్చేసరికి చాలా నిమిషాలు గడిచాయి.

నీరసంగా మంచంమీద కూర్చుని, "నువ్వు హృదయం లేని మనిషివి, రామ్!" అంది వసంత.

"ఏమయింది, వసూ?"

కోపంగా, బాధగా, నా కళ్లల్లోకి చూసింది వసంత. విద్రిస్తున్న కళ్లమీద ఉదయిస్తూన్న సూర్యకిరణాలు పడ్డట్టు ఉంది.

"శ్రీనివాస్ అంతా చెప్పేరు-"

అతనేదో అబద్ధంచెప్పి, వసంత మనస్సువిరిచేప్రయత్నం చేశాడనుకున్నాను.

"ఏమిటది?"

"ఆ పాముల పుట్టలోకి ఎందుకు వెళ్లేవు? నన్ను హడల గొట్టడానికేనా? లేక, నీధైర్యం నాకు చూపుదామనా?"

తెల్లబోయి చూశాను. పాము ఉదంతం నే నెప్పుడో మరిచిపోయాను!

"నీ ధైర్యం నాకు తెలుసులే రామ్! నన్నేడిపించా లంటే ఇంకా చాలా పద్ధతు లున్నాయి."

"అదేంకాదు వసూ!... పాము కనిపిం చిందనిఅనుకుని అతను భయపడబోయడు... బయట ఎంత అందంగా ఉంద నుకున్నావు!... అలాగా తిరిగి వొచ్చాను" అన్నాను, కిందటి మూడు గంటలలో నా అద్భుత లోకాలని తలుచుకొని, పశ్చాత్తాపంతో.

"అబద్ధాలాడకు రామ్! దర్వాన్ని వెళ్ల మంటే హడిలి పోయాడు. ఆ కొండ పేరే నాగుపాముల పుట్ట అట! ...భగవాన్! ఎంత గాభరా పెట్టేవు!"

అప్పుడు బోధ పడింది పరిస్థితి. టేబిల్ మీది మంచినీళ్లు తాగాను.

"నాకూ ఇయ్యి" అంది వసంత. గ్లాస్ కడగబోయేను. ఆమె తీసుకుని అందులోనే తాగింది.

"అది చెయ్యకూడని పని" అన్నాను.

"ఎం?" అంది వసంత నవ్వుతూన్న కళ్లతో చూస్తూ.

"నాకు తేలీదు లే వసూ...నీకు తెలుసును" అన్నాను, నా ఉద్దేశాన్ని మాటల్లో పెట్టలేక.

"పడుకో - నిద్ర వొస్తోందా?" అంది వసంత, లేచి నిలబడుతూ.

"ఇంకా రాదులే, కూర్చో" అన్నాను.

"వొద్దు... నిద్రపో" అంది వసంత అలాగే నిలబడి.

ఆమె మనస్సులో ఏ భావాలు ఉన్నాయి? ఆ నిండు హృదయంలో ఏమాటలు ఉన్నాయి? ఎలాగ తెలుస్తుంది? ఆమె నీటి మేఘం లాటిది వర్షించ దలచుకున్న చోట, వర్షించ దలచుకున్నప్పుడు వర్షిస్తుంది. లేకుంటే, అలాగే తొలగి పోతుంది.

ఆమె అలా కిటికీదగ్గరకి వెళ్ళి బయటికి చూస్తూ నిలబడింది బయటంతా అతి ప్రశాంతంగా ఉంది, చిక్కటి వెన్నెట్లో. దూరాన్న నదీప్రవాహం గంభీరంగా సాగిపోతోంది.

దగ్గరకి వెళ్ళి ఆమెని నావైపు తిప్పుకున్నాను. ...

"ఏమిటి వసూ?"

వర్షించే క్షణాల ముందు ఆకాశంలాగ ఉన్నాయి ఆమె కళ్లు.

"నువ్వు-నువ్వు ఏమీ చూడలేవులే!" అంది, ఉద్వేగాన్ని ఆపుకుంటూ వసంత.

"నాకు తెలుసు" వసూ...వెయ్యి సందేహాలూ, లక్ష భయాలూ నన్ను కట్టిపడేశాయి. జ్ఞాపకాల బరువు నన్ను క్రిందికి ఈడుస్తోంది.

ఆమె ముఖం నా గుండెల్లో దాచుకుంది, గాలివాన నించి రక్షణ కోసం ఒచ్చిన చిన్న పక్షిలాగ.

"నీకు ద్రోహం చెయ్యలేను వసూ..."

"అదే రామ్, నే నడుగుతోన్నదీ..."

"వసూ...వసూ..."

ఆమె నా చేతుల్నించి నెమ్మదిగా బయట పడి, ఒక్క సారి నావైపు చూసి, వెళ్ళి పోయింది.

బట్టలు మార్చుకుని, మంచంమీద పడుకున్నాను. తుఫానులో సముద్రంలాగ కొట్టుకుంటున్నాయి ఆలోచనలు.

క్షణక్షణానికీ వసంతకి నేను చేస్తోన్న అన్యాయం ఎక్కువై పోతోంది, నా జీవితంలో ఆమె ఒక భాగం. ఆమెకి నేను జీవితం.

పర్వత శిఖరంమీద నించి ఉరకలు వేసే జలపాతంలాగ కదలుతోంది వసంత-క్రింద ఏముందో తెలీకుండా.

ఆమెకన్నా నాకు ప్రియమైన దేమీలేదు. రకరకాల వ్యసనాల కౌగిటిలోనించి నన్ను వెలికి తెచ్చి ఆమె నన్ను కళ్ళల్లో పెట్టు కుంది.

కాని-నేను స్వతంత్రుడినికాదు. లోకంలో ఏకాకినైనా, ఒక జ్ఞాపకం నన్ను ఆమెకి దూరంగా కట్టిపడవేసింది. ఇన్నాళ్ళూ ఆమెకి చెప్పలేదు. చెప్పే కాలం వొచ్చింది.

ఆ రాత్రి ఎప్పుడు నిద్రపోయానో తెలీదు.

ఉదయం తొమ్మిది దాటాక తెలివి వొచ్చింది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. నేను లేచేసరికి. కిటికీలోనించి సూర్యకిరణాలు మంచం పక్కని పడుతున్నాయి.

ముఖం కడుక్కుని బయటికి వచ్చాను.

నౌకరు వచ్చి, "అందరూ గుడికి వెళ్లారు. సాయంత్రం వొస్తారు-మీకు కాఫీ తెచ్చేదా?"

"టీ కావాలి" అన్నాను, నా అలవాటు మార్చుకోలేక.

నౌకరు వెళ్ళిపోయాడు.

వీళ్ళందరూ ఏ గుడికీ వెళ్తామని చెప్ప లేదు నాతో-బహుశా నేను వొచ్చేముందు ఎప్పుడో నిర్ణయించుకుని ఉంటారు-నిన్న మధ్యాహ్నం నే నిక్కడికి చేరుకున్నాక ఈ విషయం వసంతకి జ్ఞాపకం రాలే దను కున్నాను.

టీ తాగి, బయట చెట్లకింద కుర్చీలో కూర్చున్నాను. అలసట లేకుండా ప్రవహిస్తూనే ఉంది మహానది. నిన్న రాత్రి మరో లోకంలాగ కనిపించిన చెట్లూ, అవతల అరణ్యామూ, దాని వెనక కొండా, కొత్తగా కని పిస్తున్నాయి...రోజంతా మాటలాడడం అయ్యాక కొత్తగా పరిచయం చేసుకుంటూన్న స్నేహితుడిలాగ.

న్యూస్ పేపరు అక్కడికి వొచ్చే పద్ధతి ఏదీ లేదు-కలకత్తాలో అయితే ఉదయం అరఘంటైసరికి వొచ్చేది.

ఎండ తీవ్రత హెచ్చుతోంది.

నిన్నటి చలిగాలిని జ్ఞాపకంతెచ్చుకుంటూ లేచి మళ్లా నా గదికి వెళ్ళేను. ఆ ఒంటరి తనం విచిత్రమైన అశాంతిని రగులుస్తూన్నది. వసంత ఎప్పుడు కనిపిస్తుంది, మళ్లా?

ఆమె కోసం తియ్యగా బాధ పడుతూ ఎదురు చూడడం ఇది మొదటిసారి కాదు. చివరిదీ కాదు-అదొక విచిత్రమైన అనుభూతి.

సంవత్సరం దాటిపోయింది, మాకు పరి చయం అయి, అంతకుముందు ఆమె కోసం ఇలాగ ఎదురు చూస్తూ, అశాంతితో ఈపరి సరాల్లో కూర్చుంటాననే ఊహ కలల్లో కూడా రాలేదు నేను గడుపుతోన్న రకం జీవితంలో ఇలాటి బాధలకి తావు లేదు. ఇలాటి ఊహలకి అంతకన్నా లేదు.

నేను చేస్తూన్న ఉద్యోగం నా పూర్వ జీవితం, నా అవసరాలు, అన్నీ ఆ రకం జీవితానికి దోహదం చేసేవి. పెద్ద పెద్ద వ్యాపారాలలో మానవుడి రూపం, ఆలోచన, అంతరంగం, అన్నీ మారిపోతాయి. అక్కడి స్నేహాల స్వరూపాలు వేరు; అక్కడి శత్రుత్వపు పోలికలు వేరు; అక్కడి మనుషుల ఆలోచనలే వేరు.

ఆ శక్తులు నన్ను పెనవేసుకున్నాయని అనను-లోపల రగులుతోన్న ఒక పశ్చాత్తాపాన్నీ, అనుక్షణమూ మనస్సుని వొదలని ఒక దుస్వప్నాన్నీ అణచిపెట్టే ప్రయత్నంలో నేనూ వాటికి దోహదం చేసిన మాట నిజం...లోపలి నిప్పులని ఆర్పేందుకు ఎంత మద్యం తాగినా అవి ఆగవనీ, పీడ కలలకి ప్రతికారం ఖరీదైన, అందమైన, శరీరాలుకావనీ నాకు ఎప్పుడూ

తోచలేదు...అసలా విషయం నేను ఆలోచించనేలేదు-సుడిలో పడినవాడికి సముద్రపు సౌందర్యాలేమి తెలుస్తాయి? వాడి ఆలోచనల్లో సుడుల పుట్టు పూర్వోత్తరాలెలాగ వొస్తాయి? నిరామయంగా పోరాడ్డమే ఆలోచన; పోరాటమే చేసేది. నా పోరాటం ఈ రూపంలో సాగింది

నా మీద నాకంత జాలిలేదు. కాని నేనూ ఒక సుడిలోనే పడి కొట్టుకొంటున్నది నిజం. అప్పుడు ఆ విషయం తెలియ లేదు - ఎలాగ తెలుస్తుంది? నా దృష్టి ప్రస్తుతంమీద. ఈ రోజు; ఈ సాయంత్రం; ఈ రాత్రి-జీవన ప్రమాణం. ఆద్యంతాలకీ, జీవన సుఖదుఃఖాలకీ అందులో తావులేదు. జీవితం అలాటి శిఖరాలమీద సాగిపోతూ ఉంటుంది.

శిఖరాలమీద సాగే ఏనదీ ఎప్పుడో కిందకి పడక తప్పదు-మెల్లిగా కాదు; ఒక్కసారి, తృళ్లిపాటుతో-నురగలతో.

అలాటి రోజు ఉంటుందనీ, అదీ నా జీవితంలో వొస్తుం దనీ, ఆ నురగలని మళ్ళీ కూడదీసుకుని కొత్త జీవితం ప్రారంభిస్తా ననీ అనుకోలేదు నేను.

కాని, అనుకున్నా, అనుకోకున్నా, జరగాల్సినవి జరుగుతూనే ఉంటాయి! అలాగే వసంతని కలుసుకున్నాను.

ఆ సాయంత్రం బాగా జ్ఞాపకం ఉంది. అందులోని ప్రతి నిమిషమూ. ప్రతీ మాటా. ప్రతీ కదలికా...దూరంగా ఉన్న కొండలాగ నా జ్ఞాపకాల్లో శాశ్వతంగా ఉండిపోయాయి.

వ్యాపారంమీద వారం రోజులు దక్షిణ దేశం తిరిగి ఆ ఉదయమే కలకత్తా తిరిగి వొచ్చాను. తొలిరోజు సాయంత్రమే

తిరిగి వొచ్చి ఉండాల్సింది - విశాఖపట్టణం నించి ప్లయిట్ రద్దు అయి ఉండకపోతే. రైళ్ళలో తిరిగే అలవాటు చాలా కాలంనించి తప్పిపోయి, ప్రయాణం చాలా బడలికగా అనిపించింది.

పదిన్నరకి ఆఫీసు చేరి, రెండుదాకా ఏకాగ్రతతో పని చేశాను. బోర్డుకోసం నోటుడిక్టేట్ చెయ్యడం ముగించాను.

అప్పుడు జ్ఞాపకం వొచ్చింది ఆశ.

ఆమెని చూసి పది రోజులై పోయింది. టెలిఫోన్ చేశాను.

ఎంగేజ్డ్ సిగ్నల్. నాకు చిరాకువేసింది. ఆ టెలిఫోన్ ఆమె ఇంట్లో పెట్టించినది నా సౌకర్యంకోసం.

ఆ రోజు కాలేజీ ఉంటుందనీ, ఆమె క్లాసులకి వెళ్ళి ఉంటుందనీ, నాకు జ్ఞాపకమే రాలేదు. ఐదారుసార్లు ఆపకుండా చేశాను. కలకత్తాలో టెలిఫోన్ నంబర్లు దొరకడం కష్టం. 199 సహాయంతో తప్ప. కొన్ని ప్రాంతాల్లో దొరకనే దొరకవు. అన్ని ప్రయత్నాలూ చేశాక ఆమె నంబరు దొరికింది.

"ఆశ... లేదా?" అన్నాను. సందేహిస్తూ. చిన్నపిల్ల ఎవరో లాగ ఉంది, మాట్లాడుతోంది.

"లేదు-కాలేజీకి వెళ్ళింది"

నా పేరు చెప్పి, "ఎప్పుడు వొస్తుంది?" అని అడిగాను.

"నాలుక్కి వొస్తానంది..."

"రాగానే ఫోన్ చెయ్యమను, ఏం?"

'అలాగే మీ నంబరో?"

ఇంగ్లీషు చక్కగా మాట్లాడుతోంది - ఆశ లాగే.

'ఆమెకి తెలుసును...'

'థాంక్స్...'

'వెల్ కమ్'

నాకు చిరాకు ఎక్కువైంది. నాకు కావలసినప్పుడు ఆశ కాలేజీకి ఎందుకు పోవాలి? ఆమె మీద ఉన్న అధికారంలో, విచక్షణ లోపించింది.

నాలుగున్నర దాకా నా చిరాకు ఎక్కువౌతూనే ఉంది. అంతరాంతరాలలో ఆశ నా కనుసన్నలలోనే మెలగాలనే అహంకారపు కోరిక నాకు విశ్రాంతి లేకుండా చేసింది మర్నాటికి ఉంచిన కాగితాలన్నీ ఆ గంట న్నరలోనూ పూర్తిచేశాను.

నాలుగూ నలభై దాటాక ఆమె టెలిఫోన్ చేసింది.

ఆమె 'హల్లో' వింటూనే, "ఎక్కడి తిరిగా వింత సేపూ?" అన్నాను.

నీరసంగా నవ్వి. "కాలేజీకి వెళ్ళేను" అంది ఆశ.

ఆ క్షణంలో జ్ఞాపకం వొచ్చింది. ఈ వారమంతా సెలవు అని.

"నాతో అబద్ధాలాడకు ఆశా!,...అలాటి అవసరం లేదు కదా !...సెలవుల్లో ఎందు కని?" అన్నాను.

"లైబ్రరీపుస్తకాలు ఇవ్వాల్సివొచ్చింది"

"ఓ!" అన్నాను నమ్మలేక.

"నిజంగానే" అంది ఆశ.

అనకపోతే బాగుండును. నిజం పునశ్చరణం చేస్తే అబద్ధంలాగ ఉంటుంది.

ఏమైనా, ఆశని వెంటనే ఏమీ అనదల్చుకో లేదు. ఆమెని సాయంత్రం రమ్మని, తేల్చుకుందా మనుకున్నాను.

"సాయంత్రం ఏడింటికి ట్రింకాస్ కిరా... నేను నీ కోసం చూస్తాను" అన్నాను.

నా ఆహ్వానానికి ఆమె అనందంతో ఎగిరి పడుతుందని అనుకోలేదు, కాని ఆమె జవా బివ్వకుండా, నిశ్శబ్దంగా ఉండి పోతుందనీ అనుకోలేదు.

"ఏమిటి ఆశా?" అన్నాను, కొంచెం కోపంగా.

"ఒంట్లో బాగులేదు - సాయంత్రానికి బాగుంటే తప్పకుండా వొస్తాను..."

'ఏమిటి బాధ?'

'తెలీదు...చిరాకుగా ఉంది'

'డాక్టర్ని చూశావా?'

'చూస్తాను...'

వికృతంగా అనిపించింది సంభాషణ. ఆమె ఏమిటి దాస్తోందో ఆలోచిస్తూ యాంత్రికంగా మాట్లాడుపూ, ఒక్క సారి "సాయంత్రం రా ఆశా...నిన్ను చూసి చాలా రోజులై పోయింది' అని, ఆమె జవాబు వినకుండానే ఫోన్ డిస్కనెక్ట్ చేశా నాకుకావాల్సింది సాకులు కావు 'ప్రయత్నించడం' కాదు- ఆశ.

ఏడు దాటాకగాని ఆ సాయంత్రం ట్రింకాస్ కి చేరలేక పోయాను. నా టేబిల్ దగ్గరకి వెళ్ళి కూర్చున్నాను-ఆశ రాలేదు.

చుట్టూ యువకబృందం తెగగోలచేస్తున్నారు-ఆ రోజు ఉష పాడుతుందనీ, ఆశతో కలిసి విందామనీ అక్కడికి వొచ్చాను. బార్ ఆవతల గదిలో ఉంది. ఇక్కడ నాకు కావల సిందేమీ లేదు.

పది నిమిషాలు అలాగే కూర్చున్నాను. బేరర్ ప్రశ్నలకి 'ఏమీవొద్ద'ని జవాబిచ్చి. కాలేజీ బృందంలాగ ఉన్నారు, చుట్టూ అబ్బాయిలూ, అమ్మాయిలూ, గోలచేస్తూన్న ఆర్కెస్ట్రా కఠోర శబ్దాలని మించి ధ్వని చేస్తున్నారు.

ఏడున్నర.

బేరర్ తో ఆశ మాట చెప్పి బార్ లోకి వెళ్ళేను. చాలా మంది కూర్చుని తాగుతున్నారు. గదినిండా మేఘాల్లాగ సిగ రెట్ లు, చుట్టలు కాల్చిన పొగ ఉక్కిరి బిక్కిరిగా ఉంది-ఎప్పటి లాగే.

బయటికి రాబోతోంటే పాల్ నన్ను చెయ్యి పట్టుకొని ఆపేడు.

"ఎప్పుడు రావడం ?" అంటూ పాల్ నన్ను కూర్చోబెట్టి నా జవాబు వినకుండానే, అందమైన ఈ అమ్మాయి పేరు ఆలిస్...అన్నాడు.

పలకరించి, "నాపేరు శివరామ్-" అన్నాను. కష్టంగా లాగ నవ్వు తెచ్చుకుని పరిచయాల లాంఛనాలు ముగించింది ఆలిస్. ఆమె జిన్ తాగుతోంది.

బేరర్‌ని పిలిచి నాకోసం స్కాచ్ ఆర్డరు చేశాడు పాల్. ఆలిస్‌ని పూర్తిగా మరిచిపోయినట్టు నావైపు తిరిగి, "అన్ని రోజులు ఒక్కసారి టూర్ చేస్తే ఎలా ?...ఇక్కడ ఎన్ని హృదయాలో బ్రద్దలై పోతోంటే!" అన్నాడు నవ్వుతూ, విధిగా ఆలిస్ చిరునవ్వు నవ్వింది.

"అలాటి హృదయాలకి వైద్యులు చాలామంది ఉంటారులే" అన్నాను.

బేరర్ నా విస్కీ తెచ్చాడు. ముగ్గురం గ్లాసులు కలిపి, ఎవరి గ్లాసు వారు రుచి చూశాము.

"అది నిజమే...అందులోనూ అందమైన హృదయాల బాధలకి అందరూ వైద్యులే! ఏం ఆలిస్ !".

ఆలిస్ మాట్లాడలేదు,

"అయినా జాగ్రత్త బ్రదర్ ! ఆశకి స్నేహితులు ఎక్కువౌతున్నారు. కంటికి కనిపించకపోతే, మనస్సుకి-" సగంలో ఆగి, అతను తన గ్లాస్‌లో నిమగ్నమైపోయాడు.

చాలా ఆలోచనలు వొస్తున్నాయి నాకు, ఆశ నాకు ద్రోహం చేస్తూందా ? ఆమె తన ఇష్టం వొచ్చినట్టు ఎందుకు చెయ్యగూడదు ? అమెమీద నాకు ఉన్న అధికారం ఏమిటి ?

"ఎవరది ?" అన్నాను.

"ఎవరో యువకుడు-"

నా వయస్సు నాకు జ్ఞాపకంచేసినప్పుడల్లా గుండె ఒక్కసారి దడదడ లాడుతుంది. గోపాల్ కావాలని చేసి ఉండడు-కాని, ఫలితం ఒక్కటే, నలభై సమీపిస్తూన్న నాకు యౌవనం మీద మమతగాని, నమ్మకగాని, పోలేదు-నా యౌవనంమీద.

మరో రౌండ్ ఆర్డర్ చేశాను.

'ప్రిన్సెస్‌కి వొస్తావా ?' అన్నాడు పాల్-"రాలోలా ఇంగ్లండు వెళ్ళిపోతుంది. ఇవేళ కాబరే ఉంది, ఆశని తీసుకురా"

'అలాగే...'

'పద...'

'అలాగే'

బార్‌లోనించి వొచ్చి కార్లో కూర్చుని టైమ్ చూసుకున్నాను. తొమ్మిదవుతోంది. ఆశకోసం కోరికా, అమెమీద కోపము కలిపి విచిత్రమైన పరిస్థితిలో పెట్టేయి నన్ను.

ఆశని గోపాల్-'పాల్'-నాకు పరిచయం చేశాడు. ఆమె లాటి లక్షల యువతులకథే ఆమెది. అతి బీదరికం, చేతగాని తనం-దేనికైనా సిద్ధం అవడం.

"ఈ రిసెపషన్‌లో ఎక్కడ ఉద్యోగాలు ఉన్నాయి? ఎవరో నా స్నేహితుడు ఆమెని ఒక ఉత్తరం ఇచ్చి పంపేడు; నీ దగ్గరికి పంపుతాను. ఎలాగ సహాయం చేస్తావో చూడు-హృదయ విదారకంగా ఉంది అమె స్థితి" అని టెలిఫోన్‌లో చెప్పేడు గోపాల్.

నాలుగు దాటేక వచ్చింది ఆశ.

అమె సౌందర్యమూ. పోషణలేని శరీరమూ, దిగులూ అన్నీ ఒక్కసారి ముంచేశాయి నన్ను.

'ఏం చదువుకున్నావు ?'

'ఇంటర్.'

'ఇప్పుడు ?'

'ఏమీ లేదు-'

'చదువు మానేశావా ?'

'ఆఁ...'

'టైప్ వొచ్చునా ?'

'రాదు-'

'మరి ?'

'ఇంకేమీ రాదు.'

'నీ కెక్కడ దొరుకుతుంది ఉద్యోగం ?'

నిస్పృహగా నా కళ్ళలోకి ఒకసారి చూసి, తల దించు కుంది ఆశ.

'ఆఫీసు టైమయింది-ఇంటికి వొస్తావా ?

'మీ ఇష్టం-'

ఆమె చదువూ, కుటుంబమూ, ఆనాటినుంచీ నా ఖర్చు మీదనే నడిచాయి. ఆమెలో పతితుల దైన్యంకాని, మనుషుల దురాశకాని ఏమీ కనిపించలేదు. నిర్లిప్తంగా ఆ ఏర్పాటు ఆమె అంగీకరించింది-అంతే. అవసరాలకి డబ్బు అడిగి తీసికెళ్లేది; రమ్మంటే వొచ్చేది.

ఆమె ఇంటికి వెళ్ళి తలుపు తట్టేసరికి ఆశ రాలేదు. పది హేడేళ్లు వొచ్చీ రాని అమ్మాయి తీసింది తలుపు.

'ఆశ-ఉందా ?'

'ఆఁ, మీరు'

'శివరామ్.'

'లోపలికి రండి.'

రెండు గదులఇల్లు. వీధి గదిలో ఉన్న సోఫాలో సందే హంగా కూర్చున్నాను.

ఐదారు నిమిషాలయాక ఆశ వొచ్చి నిలబడింది. నిద్ర లేచిందల్లే ఉంది-బద్ధకంగా ఉంది.

'నీకోసం ఎదురు చూశాను?' అన్నాను. ఉపోద్ఘాతం లేకుండా.

'సారీ-ఒంట్లో బాగులేదు.'

అడుగు ముందుకి వేసి, కుర్చీ పట్టుకుని నిలబడింది.

'పద - డాక్టరు దగ్గరకి వెడదాం...'

'వొద్దు - రేపటి కదే బాగుంటుంది?"

పాల్ మాటలు చెదలాగ కెలుకుతున్నాయి నన్ను; ఆమె నన్ను కాదందనే అహంకారం జ్వరంలాగ వేదిస్తోంది.

"ఐతే. ఇవేళ రావన్నమాట!"

"ప్లీజ్! క్షమించడి"

"నాకు తెలుసు ఆశా!...నా దగ్గర అబద్ధం ఎందుకు చెప్తావు ? - నీ ప్రియుడెవరో అక్కడికే వెళ్లు. మళ్ళీ నాకు ముఖంచూపకు."

తెల్లబోయి చూసింది ఆశ.

"అవినీతిలోనూ ఓ నీతి ఉందిలే-కనీసం, నా మట్టుకు. మోసగాళ్ళంటే అసహ్యం నాకు!"

లేచి తలుపుదగ్గరగా వెళ్లాక జ్ఞాపకంవొచ్చి, వెనక్కి తిరిగాను. జేబులోనించి పర్స్‌తీసి ఆమెమీదికి విసిరాను. "నా జ్ఞాపకార్థం ఉంచుకో" అని మళ్లీ వెనుదిరిగాను.

"మిస్టర్!" అనే కొత్తగొంతుక విని.

"ఏమిటి?" అన్నాను ఆమె వొంక చూస్తూ. ఆమె అప్పటిదాకా లోపలి ఉందికాబోలు - ఎవరో.

"నువ్వు మనిషివా, పశువ్వా?"

క్షణం నా చెవులని నేనే నమ్మలేకపోయాను.

"ఎవరు మీరు?"

"ఆశకి స్నేహితురాల్ని...ఈ పశుప్రవర్తనచూసి ఊరుకోలేకపోయాను."

"మీ ప్రవర్తన ఎలాగుందో తెలుసా?"

"పశువుల మధ్య వాటి గుణాలు మనుషులకి వొస్తుంటాయి."

నవ్వేను.

"ఆమెతో మీ సంబంధం ఏమిటో తెలీదు - కాని... నూరు డిగ్రీల జ్వరంలో ఆడదాన్ని అలాగ ట్రీట్ చెయ్యడం..."

"సారీ-"

నేను బయటికి వొచ్చేశాను. తిన్నగా ఇంటికివెళ్ళి షవర్ కింద స్నానంచేసి వొచ్చేసరికి డ్రాయింగ్ రూమ్‌లో ఆమె!

"మీరు..." అన్నాను.

"క్షమాపణ చెప్దామని వొచ్చాను."

"నేనే చెప్పాలి..."

"కాదు నిజం తెలిసింది. ఆశదీ చాలా తప్పు ఉంది. మధ్య కలుగజేసుకోవడం నాదీ తప్పే!"

ఏమనాలో తెలియలేదు.

"ఇల్లెలాగ తెలిసింది!"

"మీ పర్స్‌లో కార్డు ఉంది. ఈ నెంబరు అంతమంది ఉండే ప్రదేశం కాదు! అన్నట్లు, ఆశ ఈ పర్స్ మీ కిమ్మంది."

'అది నాది కాదు. ఇచ్చినది ఆమెకి.'

'వెయ్యి చిల్లర ఉందిందులో-'

'ఉండనివ్వండి ఆమెకే ఇవ్వండి-'

'మీరే ఇవ్వండి'

'మా కింకేమీ సంబంధం లేదు...మీరు మీ పేరేమిటి?'

'వసంత'

'వసంతగారూ-'

'వసంతా, అనండి చాలు!'

'ఆల్‌రైటు వసంతా ? మీస్నేహితురాల్ని మీరు క్షమించారా ?'

'ఆc. దాన్ని అదే క్షమించుకోలేకుండా ఉంది.'

'ఇలాంటివి ఎంత త్వరగా అంతం ఐతే అంతమంచిది'

'అవును, కొత్తగా ఇంకో అమ్మాయి దొరుకుతుంది?'

'ఈ వ్యవహారాల్లో ఇద్దరు ఉంటారులెండి...మీరు టీ తాగుతారా?'

'ఆశని క్షమిస్తానంటే.'

'మళ్ళీ కలుసుకోకుండా, అలాగే'

'అయితే టీ ఇవ్వండి.'

వసంత అలాగ, పెనుగాలిగా, మలయమారుతంగా, నా జీవితంలోకి వొచ్చింది. ఆ రోజు అర్ధరాత్రిదాకా మాట్లాడుతూనే ఉన్నాము. మర్నాడు-ప్రతిరోజూ...నా సాయంత్రాలు అన్నీ ఆమెతో.

'శివరామ్ జోగి ఐపోయాడు' అన్నారు మిత్రులందరూ'

"ఇంత బతుకూ బతికి మంచివాళ్ళలో కలిసిపోయాడు-పాపం!" అన్నారు.

నేను బాధపడలేదు. నా ఆనందం, వినోదం, కాలక్షేపం, హృదయం-అన్నీ వసంత. అప్పటిదాకా స్త్రీ అంటే ఆమె శరీరం కన్న కనపడని నాకు వసంత సౌందర్యం అంతా ఆమె కన్న ఎంతో తక్కువై పోయింది.

మేము రెండు శరీరాలం కాదు, రెండు మనసులం. ఆమె కన్న నాకు లోకం లేదు. నాకన్నా ఆమెకీ లేదు!

కాని, నా వయస్సు ఆమె జీవితాన్ని పూర్తిగా తీసుకోకుండా చేసింది...యౌవనం యౌవనాన్ని వరించాలి. అది సహజం. ఆమె నన్ను నా వయసులో కాదు. తన వయసులో

చూసుకుంటోంది. ఆమెని ప్రేమిస్తున్నాను. అందుకే, ఉద్రేకం లోని ఆమె వ్యామోహాన్ని తృప్తిపరచి ఆమె జీవితాన్ని బలి తీసుకోలేను...

అదీగాక, భర్తగా నేను ఆమెకి కొత్తజీవితం ఇవ్వలేను. అలాంటి దేవతకి మనసులో పెద్ద చీకటిని దాచుకున్న నేను అనర్హుణ్ణి.

ఆ నిజం శకలాలలో ఆమెకి తెలుసును. పెద్ద జ్వరంలో వొళ్ళు తెలియనప్పుడు ఆ జ్ఞాపకాల కొన్ని శిధిలాలని వసంత చూసింది. కాని, పూర్తి నిజం ఆమెకి తెలీదు.

ఆమె అడగనూలేదు. నామీద అలాంటి నమ్మిక ఆమెది.

కాని ఆమెకి చెప్పాలి. ఈ ప్రవాహంలో ఆమె మునిగి పోకుండానే, ఆమె జీవితం జలపాతంలాగ క్రిందికి ఉరక కుండానే, ఆమెకి చెప్పాలి.

రోజంతా పిచ్చిగా గడిచింది. వసంతకోసం అలాగ తపించుకుపోతానని అనుకోలేదు...ఇన్ని అనుభవాల ఈ వయస్సులో, నాకు ఈ పరిస్థితి కొత్తగా ఉంది.

నిజంగానే. నాకు పెద్దతనం రాలేదు అనిపించింది. సాయంత్రందాకా ఎలాగ గడిపానో! అప్పటికీ వసంత రాలేదు-షికారుగా బయలుదేరి చాలా దూరం వెళ్ళేను.

అలాగవెళ్ళి, రాత్రి పది అయ్యేదాకా రాలేకపోయాను.

అంత ఆలస్యంగా ఉందామని అనుకోలేదు-కాని, అనేక పరిస్థితులు నాచేత ఆలస్యం చేయించాయి.

అక్కడి ప్రకృతి-సౌందర్యం నన్నింకో మనిషిని చేసే సింది. తారురోడ్లకీ, అత్యున్నత సౌధాలకీ, విడలేని యాంత్రిక ధ్వనికీ, భరించలేని ధూమ సహితమైన గాలికీ, మహానగర వాతావరణంలో అలవాటుపడ్డాక ఈ సౌందర్య పరిసరాలూ ఈ ప్రశాంతత నన్నింకో మనిషిని చేశాయి.

రెండుమూడు మైళ్ళు నడిచాననుకుంటాను. అలసట వొచ్చింది-వ్యాయామం, అనిర్దిష్టమైన జీవనం, వాటి ఖరీదు అవి తీసుకుంటున్నాయి!

కూర్చున్నాను.

అక్కడికి నది మరీ చేరువగా ఉంది. ఒడ్డుదాకా పెద్ద పెద్ద వృక్షాలు, మధ్యన ఒళ్ళు పులకరింపజేసే పచ్చటి బయలు.

కాంతి క్రమంగా పల్చబడుతోంది.

అలసట తీరగానే తిరిగి వెళ్దామనుకున్నాను-ఆ సౌంద ర్యం వొదలి వెళ్లడం ఎంతకష్టమైనా అంతకన్నా నన్ను పులక రింపజేసే వసంత రాగానే నాకోసం చూస్తుందని తెలుసును. ఆమెని నిరాశ చెయ్యడం కాని పని.

పది నిముషాలు కూర్చుని లేవగానే ఒక చిత్రమైన భావన కలిగింది నాకు. ఆ ప్రదేశాన్ని ఎక్కడో చూశాను, ఇంతకు ముందు.

ఆ భావన బలీయమైన నమ్మికగా మారేందుకు ఎక్కువ కాలం పట్టలేదు. నిజం...కాని, ఈ ప్రదేశానికి నేను రాలేదు ఎప్పుడూ.

మళ్ళీ కూర్చున్నాను. ప్రగాఢమైన ఆలోచనలో పడ్డాను.

మెరుపులాగా ఒక్కసారి జ్ఞాపకం వొచ్చింది. నానుంచి నేను పదిహేను సంవత్సరాలు దాచుకుందుకు ప్రయత్నించిన దంతా దానిలోనే ప్రవాహంలాగా బయటికి వొచ్చింది.

అవును.

అవూరు అవతలా ఇలాగే నది, ఇలాగే నది ఒడ్డువెంట పెద్దపెద్ద చెట్లు, ఇలాగే ఇవతల చిన్నచిన్న కొండలు.

అవును. అంతా ఇలాగే ! మా వూరు ?

ఏ రహస్య శక్తి నన్నిక్కడికి తెచ్చిందో తెలీదు. కాని, హృదయం ప్రక్షాళనంచేసుకోడానికి ఇంతకన్న తగిన సమయం కాని, స్థలం కాని ఉండదు.

అప్పటికి నాకు ఇరవైనాలుగేళ్ళు.

ఎప్పుడో నావాళ్లందరూ లేకపోయారు-ఒక్క అన్న తప్పితే. అతనూ సహోదరుడు కాదు; సవతితల్లికి కలిగిన ఒక్కడు. లోకం ఇలాంటి పరిస్థితుల్లో నమ్మేవన్నీ నిజం అయేయి. నా పుట్టుక తరవాత అమ్మ కళ్ళు ముయ్యడంతో విచిత్రమైన జీవితం అయిపోయింది నాది. నాన్న ఇద్దరు భార్యల మరణంతో కాబోలు, వైరాగిలాం ఐపోయారు. ఐతే, ఎలాగో లాయరుగా ఆర్జన చేస్తూనే ఉండేవారు-నన్ను చదువుకి కాలేజీకి పంపేరు. అప్పటికి అన్న లా చదివి ఇంటికి రావడం జరిగింది.

నా ఎమ్. ఏ. పరీక్షలు పదిరోజు లున్నాయనగా ఆయన పోయారు. ఆ టెలిగ్రాం వొచ్చిన రోజునే, నాన్నగారు పంపిన

ఐదువేల రూపాయల డ్రాఫ్టు అందింది. అప్పుడది విచిత్రంగా తోచినా, తరవాత అర్థం ఐంది.

పరీక్షలయి, ఇంటికి వొచ్చాను.

నన్ను చూసి అన్నా, వొదినా ఆశ్చర్యపడ్డారు. బహుశా నే నక్కడికి రానని అనుకుని ఉంటారు. కాని, ముందర నాలు గైదు రోజులు నేనది పట్టించుకోలేదు.

చిన్నప్పటినుంచీ పుట్టి పెరిగిన ఊరైనా, నా సహాధ్యాయులూ, స్నేహితులూ ఊరువిడిచి వెళ్ళిపోయారు. అంచేత కాలక్షేపం చాల కష్టంగా ఉండేది.

పగలంతా ఏదో పుస్తకాలు చదివి సాయంత్రం షికారు వెళ్ళేవాడిని. అన్న ఎంత శ్రమపడుతున్నాడో, నాన్నగారు అస్తి అంతా ఎలాగ దుర్వ్యయం చేశారో ఒదిన రోజంతా చెప్తూనే ఉండేది. సాయంత్రం తిరిగి రావడం ఈ జ్ఞాపకాలనించి తాత్కాలికంగానైనా విముక్తి ఇచ్చేది.

కాలేజిలో, యూనివర్శిటీలో, పట్టుదలతో పనిచేసేవాడిని. ఎమ్. ఏ. లో కనీసం సెకండ్ క్లాస్ వొస్తుందని అనుకున్నాను. కాని, ఫలితాలు తెలిసేదాకా భరించలేని ఆందోళన ఉండేది కాలం గడపడం కష్టంగా ఉండేది.

వాటన్నిటి మధ్యా శాంతతో పరిచయం ఐంది.

అమె నాకు చిన్నప్పటినించీ తెలిసినా, మళ్ళీ యవ్వనంలో ఆమెని కొత్తగానే కలుసుకున్నాను. నాకన్న ఐదారేళ్లు చిన్నదైనా, బాగా లోకజ్ఞానం ఉండడాన్న వాళ్ళింటికి వెళ్ళ

నప్పుడల్లా అనేక విషయాలమీద నాతో వాదన పెట్టుకునేది. నాతో లైబ్రరీకి వొచ్చి పుస్తకాలు తీసుకుని చదివి నాచేత చదివించి, చర్చించేది.

అప్పుడూ అప్పుడూ ఊరి అవతల నది వొడ్డుకి షికారుకి వొచ్చేది. చీకటి పడేసరికి ఇంటికి తిరిగి వెళ్ళేవాళ్ళం.

క్రమంగా ఆమె సాన్నిహిత్యం నాలో విచిత్రమైన మార్పులు తెచ్చింది. అనుభవం తరవాత అందులో విచిత్రం ఏమీ లేదనీ, వయసుతో మార్పులు వొస్తాయనీ తెలుసు-కాని, అప్పుడు అదే లోకంగా ఉండేది.

ఇలాగే ఓ సాయంత్రం చెట్టుకింద కూర్చున్నాము. ఏదో మాట్లాడుతూ శాంత నావైపు ముఖం ఎత్తింది.

అప్రయత్నంగానే, ముద్దు పెట్టుకున్నాను.

ఆమె ఆశ్చర్యపడింది.

'తప్పు శివరామ్...అలాగ చెయ్యకు!' అంది, మందలింపుగా.

నాకు ఈ విషయాల్లో అప్పటికి ఉన్న అనుభవం అంతా నేను చదివిన కొన్ని చవక పుస్తకాలనించే.

అందుకే ఆమెను తప్పుగా అర్థం చేసుకున్నాను. మరుక్షణం నాలో ఒక పిచ్చిమనిషి ప్రవేశించాడు.

అంతా ముగిశాక, ఆమె దుఃఖం చూశాక, నాకు నా మీద అసహ్యం తప్ప మరేభావనా మిగల్లేదు.

"క్షమించు శాంతా!" అన్నాను.

ఆమె మాట్లాడలేదు. నీళ్లలో ముఖం కడుక్కొని ఇంటికి బయలుదేరింది. ఆమెని నిశ్శబ్దంగా ఇంటిదగ్గిర విడిచి నేనూ ఇంటికి వెళ్లేను.

ఆ రాత్రి పెద్ద వర్షం కురిసింది.

ఉదయం తొమ్మిది వేళ. వొదిన ఎవరితోనో గట్టిగా మాట్లాడుతూ, 'పాపం! శాంతకాదూ! ఉదయం నూతిలో పడ్డదిట,' అనడం విన్నాను.

అప్పుడు నా భావనలకి వాక్యరూపం ఇవ్వడం కష్టం... ప్రపంచం అంతా నన్ను వేలెత్తి చూపుతున్నట్టూ, అందరూ ఏకకంఠంతో నన్ను దూషిస్తున్నట్టూ అనిపించింది.

నిశ్చేష్టుడినై అలాగే పడి ఉన్నాను నా మంచంమీద. వెయ్యిజన్మలెత్తినా, నా నేరానికి పరిహారం చేసుకోలే ననిపించింది ఆ క్షణంలో చచ్చిపోదా మనిపించింది.

పదకొండయేసరికి నాలో ఉన్న పిరికితనం నన్ను పూర్తిగా వశపరచుకుంది. ఒక పెట్టెలో నా బట్టలు సర్దుకుని, నా బేంక్ పాస్‌బుక్కూ, నా దగ్గర ఉన్న రెండుమూడువందల రూపాయలూ తీసుకుని పన్నెండుకి వచ్చే పేసింబరులో విశాఖ పట్నం చేరుకున్నాను. "నేను వెళుతున్నాను - ఉత్తరం వ్రాస్తాను" అని ఒక చీటీమాత్రం అన్నయ్య టేబిల్‌మీద వొది లేశాను.

అరాత్రి కలకత్తా వెళ్ళే బండిలో కూర్చుని మూడోరోజు ఉదయం కలకత్తా చేరేను. నా లక్ష్యం ఒక్కటే-ఈ మహానగరంలో ఎవ్వరికీ కనిపించకుండా మాయం ఐపోవాలని. క్షణ క్షణమూ శాంత ముఖం నన్ను వొదలకుండా బాధపెట్టేది. నిమేషమూ చేతులు చూసుకునేవాడిని - వాటిమీద రక్తం ఉందేమోనని. జీవితం పీడకలలాగ ఉండేది.

నెలరోజు లలాగే గడిచాయి. ఒక్కరోజు సాయంత్రం అటూఇటూ తిరుగుతూ, ఒక తెలుగు పేపరు కొన్నాను బేరంగిలో. మా రిజల్ట్సు వొచ్చాయి-ఫస్ట్‌క్లాస్‌లో పాసయాను.

కాని ఆ వార్త నన్ను సంతోషపెట్టలేదు. రంపాన కోస్తూన్నట్టు ఉండేది అనుక్షణమూ.

నా దగ్గర డబ్బు తరుగుతోంది.

ఉద్యోగ ప్రయత్నంలో ఒక పెద్ద కంపెనీలో దరఖాస్తు పెట్టేను వారం కాకుండా పిలుపు. జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం, సేల్సులో చేరడం అన్నీ జరిగాయి.

ఆ తరువాత ఇంగ్లీషువాళ్లు ఒకరొకరూ దేశం వొదిలి పోవడంతో నా ఉద్యోగం పెరుగుతూ వచ్చింది. క్రమంగా శాంత నన్ను బాధించడం తగ్గించింది. సంవత్సరాల అనుభవాల పొరల్లో ఆ పాడు సాయంత్రం నాకు క్రమక్రమంగా అస్పష్టమైన కల ఐపోయింది.

ఇప్పటిదాకా...ఈనాటిదాకా...

వసంత నా జీవితంలోకి వొచ్చేదాకా ఇదంతా నన్ను బాధ పెట్టలేదు. ఆశద్వారా ఆమె నన్ను కలుసుకుంది...ఆ పరిచయం నాకు తెలియకుండానే అమెలో శాంతని చూపింది.

వసంత నాకు స్నేహితురాలిగా కావాలి. ఆమెకోసం, ఆమెని సంతోషపెట్టడంకోసం త్రాగుడు పూర్తిగా మానుకున్నాను. ఆశని బి. ఏ. పూర్తిచేసేదాకా ఆదుకుని, ఉద్యోగం చూపించాను-అదీ వసంత కోరికమీదనే. నాలుగైదుసార్లు ఆశ నా ఇంటికి వొచ్చినా నా వ్రతభంగం కాలేదు. ఆ శక్తి వసంతే ఇచ్చింది.

కాని. ఆమెకీ నాకూ మధ్య శాంత; నా వయస్సూ ఆమెను సహచారిణిగా చేసుకోవడంనించి నన్ను విముఖుడ్ని చేసింది. ఆమె శ్రేయస్సుకోసమే. మాకు దాంపత్యం కుదరదని నిర్ణయించుకున్నాను. నా జీవితం చివరి అధ్యాయంలోకి పరిగెడుతోంది. ఆమె నిండు జీవితం ఇంకా ముందేఉంది. ఆమె దౌర్బల్యాన్నించి ఆమెని రక్షించాలిగాని, దాని కామెని ఎలాగ బలిచెయ్యను ?

శాంతని గురించి ఆమెకి చెప్పలేదు.

బహుశా అదంతా తెలిస్తే నా జీవితం ఆమెకి అర్థం అవుతుంది. నా వయస్సు కనిపించని శరీరం కాక, వయస్సుని మించిన ఈ అనుభవాలు ఆమెకీ నాకూ మధ్య కొత్త సంబంధం ఏర్పరుస్తాయి. చక్కటి యువకుణ్ని, ఆమెతో కలిసి అనుభవాలు మొదలుపెట్టే యువకుణ్ని ఆమె పెళ్ళి చేసుకుని సుఖపడుతుంది. నాకూ శాంతి ఇస్తుంది.

ఇలాగ చాలాసేపు ఆలోచించాను. వసంత చాలా శ్రీమంతుల పిల్ల. ఆమెకోసం తపిస్తూన్న యువకుడు హరీష్. అతను అమెరికాలో ఉంటున్నాడు. ఆమెకుటుంబం అందరూ వాళ్ళకి వివాహం కావాలని ఆశిస్తున్నారు.

అలాగ జరగాలి, అనుకున్నాను. ఆమెమీద నా అనురాగం ఎన్నటికీ తరగదు? మా తరాలు వేరు. అందుకే ఇలాగ జరగాలి...కాని...

చంద్రోదయం అయింది.

లేచాను. వసంతని వొదలుకోవడం చాలా కష్టమైనదనే ఆలోచన ఇంటివైపు అడుగులు వేసినకొద్దీ బలవత్తరం కాజొచ్చింది. ఆ ప్రశాంతతలో నేను చేసుకున్న నిర్ణయాలు అడుగడుక్కి సడలసాగాయి.

కాని, ఆమెకి నిజం చెప్పాలన్న నిర్ణయం మాత్రం మారలేదు...

దారిలో నాకు తెలియకుండానే అడుగులు త్వరపడసాగేయి. కాలిబాట-కాని, నా మనస్సులో ఉన్నది వసంత మాత్రమే. మనస్సంతా అమెతో నిండిపోయింది.

ఆమె నాకు కావాలి...

కాని, ఆమె నిజం తెలుసుకోవాలి.

ఇంకా త్వరగా నడిచాను.

నే నింట్లో అడుగు పెట్టేసరికి అంతా సందడిగా ఉంది. శ్రీనివాస్ నాకోసం చూస్తూన్నట్టు ఎదురువచ్చి, "శివరామ్, ఎక్కడికి వెళ్లేరు? మీకోసం చుట్టుప్రక్కల అంతా గాలించేను" అన్నాడు కొంచెం ఆయాసంగా.

ఎక్కడికి వెళ్లేనని చెప్పేది ? మరోలోకానికా ? మరో కాలానికా ?

"అలాగ తిరిగి వొచ్చాను...ఆలస్యం ఐపోయింది."

హేమలతకూడా నన్ను చూసి బరువు దిగినట్టు సంతోషించింది.

"ఎక్కడికి వెళ్లేరు ?" అంది.

"అటు-మూడు మైళ్లుంటుంది అన్నాను. నేను వెళ్ళిన దిక్కు చూపుతూ.

"క్షేమంగా తిరిగి వొచ్చారు! అదే చాలును...రండి! భోంచేద్దాం" అన్నారు దంపతులిద్దరూ.

వసంత కనబడలేదు. అడగడానికి సందేహంగా ఉండి ఊరుకున్నాను. కాని, అది మరో పదినిమిషాల వరకూ పెద్ద వెలితిగా ఉండిపోయింది.

ముగ్గురమూ భోజనానికి కూర్చున్నాము. తరువాత వొచ్చింది వసంత.

వసంత నావైపు చూడలేదు. ఒక్క మాటాడలేదు. అది గమనించనట్టే శ్రీనివాస్, హేమలత నా చర్యలో ఎన్ని ప్రమా

దాలున్నాయో చెప్పారు. యుద్ధంనుంచి బయటపడినవాడిని లాగ చూశారు నన్ను.

ఏకాంతంలో, నా ఆలోచనల్లో, నా జీవితం అలాఉందని వాళ్ళకి ఎలాగ చెప్పను ?

"మీరేం తినడంలేదు..." అన్నాడు శ్రీనివాస్. నిజంగానే నా కాకలిలేదు.

ఏలాగో భోజనం ముగించి లేచాను. వసంత ఎందుకలాగ దూరంగా ఉండిపోయింది? ఆ నిశ్శబ్దంలోనే ఎన్నో ఎత్తిపొడుపు లున్నాయని ఆమెకి తెలీదా ?

భోజనం అయాక క్రిందికి వెళ్ళలేదు నేను-నిన్నటి బంగారు క్షణాలు అటు పిలుస్తోన్నా, ఇవాళ వసంత కొత్త అవతారంలో ఉండడాన ఆ క్షణాలు మళ్ళీ రావని తెలిసి.

వెళ్ళి ఒక పుస్తకం తీసి చదవబోయాను. కాని, చదువు సాగలేదు.

అర్ధరాత్రి అవుతూంటే దీపం ఆర్పి, తలుపు దగ్గరగా వేసి, నిద్రించే ప్రయత్నం చేశాను.

నిద్రరాదు.

ఏదో చెప్పలేని ఆవేదన; అశాంతి.

నిశ్చలంగా పడుకున్నాను.

'నాకు వసంత కావాలి...ఆమెని హరీష్‌కిగాని, మరెవ్వరికిగాని దత్తం చెయ్యలేదు'.

ఆ ఆలోచన వొచ్చాక మనస్సు కొంత శాంతించింది. అలాగ ఎంతసేపో...

సగం తెలివిలో ముందర అడుగుల సవ్వడి వినిపించి పూర్తిగా తెలివి వొచ్చింది.

వసంత...

లేచి కూర్చున్నాను. ఆమె వొచ్చి నా ప్రక్కనే కూర్చుంది.

మండుటెండల మాసాల తరవాత తొలకరిలాగ వొచ్చించి వసంత. ఈమె నెలాగ వొదులుకోవడం?

ఆమె మాట్లాడ లేదు.

నేనూ మాట్లాడలేదు-చాలా సేపు.

మాటల కవసరం ఏమిటి ?

నా నిశ్చయం అ నిమిషాలలో బలపడింది. ఈమె నా సహచారిణి కాని జీవితం ఒక్కరోజింక గడవదు అనిపించింది.

"కోపం వొచ్చిందా వసూ?" అన్నాను.

"లేదు...బాధ. అంతే-నీకు తెలీదు;"

'తెలుసు వసూ...ఇవేళ బోధపడింది?'

'ఎలా ?'

"నాతో నేను మాట్లాడుకున్నాను."

"ఐతే?"

"నువ్వు లేని జీవితం నాది కాదని తెలిసింది...నీలాగ నన్నెవరు ప్రేమిస్తారు!"

"అవును...అంతటి మూర్ఖు లెవరుంటారు!"

"అవును. అదీ నిజమే !"

వసంత నా చెయ్యి తీసుకుని, వేళ్ళతో ఆడుకుంటూంది. భరించలేని మాధుర్యం. ఆ జీవితం క్షణంలో అంతమైనా, నాకు విచారంలేదు.

మళ్ళీ నేనే, "నాకు చెప్పకుండా ఎక్కడికి వెళ్ళిపో యావు?" అన్నాను.

"దైవందగ్గరికి. నిద్రలో వున్నావు. లేపా లనిపించలేదు. అదీకాక నీ నమ్మకాలు నాకేం తెలుసు?"

"నాకు నమ్మిక వుంది. లేకపోతే నీలాంటి అమ్మాయి ఎలా దొరుకుతుంది?"

"నీవన్నీ అబద్ధాలు తియ్యటివి-"

"ఏమన్నాడు నీ దైవం?"

"నీకు బుద్ధిచెప్తా నన్నాడు."

"చెప్పేడుకూడా!"

తేలిగ్గా నవ్వింది వసంత. ఆమె కనిపించినా వినిపించినా అందంగానే ఉంటుంది. నా దగ్గరగా తీసుకున్నాను.

"నీ కొక్క విషయం మాత్రం చెప్పాలి వసూ!"

"మళ్ళీ మొదటికా?"

"కాదు. పదిహేనేళ్లనించి నన్ను దహిస్తోన్న కథ... నా కళ్లల్లో, ముఖంలో నువ్వు రోజూ గమనించే కారుమేఘాల వెనుక కథ. నన్ను నీనుంచి దూరంగా వుంచిన నా రహస్యం."

"చెప్పు..."

"విన్నాక నీ ఆలోచన అంతా మారవచ్చును."

"నేను మగవాణ్ని కాదులే."

ఆ కథ అంతా చెప్పేను, కొంత నిరూపచిత్రణ చేశాను. ఏ విషయమూ దాచుకోలేదు. నా ఏ నీచత్వాన్నీ కప్పిపుచ్చ లేదు.

అంతా వింది వసంత.

ఏమీ అనలేదు.

చాలాసేపు అలాగే నిశ్శబ్దంగా వుండిపోయింది. నా చేతుల్లోంచి క్రమక్రమంగా విడిపించుకుని, ఏమాటాలేకుండానే లేచి నిలబడింది.

నావైపు నిమిషం తేరిపార చూసి, తలుపులు తీసి వెళ్ళి పోయింది.

అలిసిపోయాను నేను. కాని హృదయం తేలికపడింది. కాలం పరుగెడుతుంది. కాని, వసంత, నా 'వసూ' నన్ను క్షమిస్తుందని తెలుసు.

ఈసారి బాగా నిద్ర వొచ్చింది.

మర్నాడు లేచేసరికి అందరూ తొందరలో వున్నారు.

బట్టలు వేసుకుని బయటకు రాగానే శ్రీనివాస్ అన్నాడు. "ఈవేళ కలకత్తా వెళ్లాలి"

"ఏం?" అన్నాను ఆశ్చర్యంగా. ఇంకా నాలుగు రోజు లిక్కడ ఉంటారని అనుకున్నాను.

"హరీష్ వస్తున్నాడు రేపు. టెలిఫోన్ వొచ్చింది ఇంటి నుంచి."

"ఓ!"

"అతనికోసం అన్నీ సిద్ధం చెయ్యటానికి వ్యవధిలేదు?"

"అవును"

"త్వరగా భోజనంచేసి బయలుదేరుదాం. సాయంత్రం ఆరింటికి చేరుతాం."

"అవును."

నా సూట్ కేస్ సద్దుకోడానికి లోపలికి వెళ్లేను. భోజనా లయేదాకా వసంత కనిపించలేదు. అక్కడ మాట్లాడనూ లేదు.

ఒంటిగంటకి అందరమూ బయలుదేరాం. ఐదు మైళ్లు అడవిలో రోడ్డు, ఆ తరువాత పెద్దరోడ్డు వచ్చేస్తుంది.

ఏర్పాట్ల ప్రకారం నేనూ వసంతా నా కార్లో వెళ్లాలి. ఆమాట శ్రీనివాస్ చెప్పేక వసంత బయలుదేరేదాకా నావైపు చూడలేదు.

శ్రీనివాస్, భార్య, నౌకరు వెళ్ళిపోగానే వసంత వచ్చి కారులో కూర్చుంది. ఆమెకి ఏమీ మాట్లాడాలనిలేదు. నాకూ ఆమె ఏకాగ్రతని భంగం చెయ్యాలనిపించలేదు.

చాలాసేపు నిశ్శబ్దంగానే ప్రయాణం చేశాము. చివరికి ఆ ఏకాంతాన్ని భరించలేక "ఏమిటింత ఆలోచన వసూ?" అన్నాను.

"రాత్రి నువ్వు చెప్పినదాన్ని గురించి."

"ఏమంటావు?"

"........."

"నేనంటే అసహ్యం వేస్తోందా?"

"లేదు. ప్రతి మనిషీ కనీసం ఒక్కసారైనా నేరం చేస్తాడు. పశ్చాత్తాపం ఉంటే పునీతుడవుతాడు. మళ్లా...

'మరి?'

'మనలో మనమధ్య ఆ జ్ఞాపకం వుండకూడదు యేం?'

'అవును'

కారు నున్నటి రోడ్డుమీద జారుతోన్నట్టు వెళ్ళిపోతూంది; మా సంభాషణలాగ కాదు.

'ఏం చేస్తావు?'

కారు మరో ఐదుమైళ్లు వెళ్ళింది.

చివరికి 'ఏం చేసేది?' అన్నాను.

ఇంకో రెండుమైళ్ల నిశ్శబ్దం తరువాత, 'ఒకేదారి కని పిస్తోంది' అంది వసంత.

'చెప్పు...'

'అక్కడికి వెళ్లు నువ్వు'.

'ఎక్కడికి ?'

దూరంగా దీపాలు ఒకటీ రెండూ కనిపిస్తున్నాయి. కలకత్తా దగ్గర పడుతోంది.

'మీ ఊరు-ఆ చోటికి...'

'వెళ్లి!'

'వెళ్లి చూడు-అంతే.'

'కాని వసంతా! పదిహేను సంవత్సరాల తరవాత-?'

'అదే రామ్! అందుకే. ఆలోచించు.'

'నువ్వు వెళ్ళమంటే వెడతాను.'

'దయచేసి వెళ్లు.'

మళ్లీ మామధ్య నిశ్శబ్దం. వాళ్ల ఇల్లు చేరేదాకా-దిగులు, నా చెయ్యి ఒకసారి నొక్కి, "వెళ్లు రామ్! ఆలస్యంచెయ్యకు," అంది వసంత.

ఆ మర్నాడు విమానంలో బయలుదేరాను.

ముందర వసంత ఆలోచన వెర్రిగా కనిపించినా, ఆలో చించినకొద్దీ ఆ ఉద్దేశంలో చాలా పటుత్వం కనిపించసాగింది.

ఈ యాత్ర నాకు విముక్తి యిస్తే, మిగిలిన కొద్దిజీవితం అయినా సుఖంగా జీవించవచ్చును.

పన్నెండయింది. మరో పది నిమిషాలలో మద్రాసులో దిగుతాను.

ఈ నిమిషంలో ఎయిరిండియాలో హరీష్ దిగివుంటాడు- అనే ఆలోచన నా మనస్సుని పాడుచేసింది.

వారం తిరిగేక కలకత్తా వొచ్చాను.

నా మనస్సు ఎలాగవుందో, అందులో ఏ ఉద్రేకాలు చెలరేగుతున్నాయో నాకే తెలీదు.

వసంత చెప్పినట్లు మావూరు వెళ్లేను.

పాసింజరు ఆగగానే అది మా వూరేనా అని ఆశ్చర్య పడ్డాను. నేను క్రిందటిసారి అక్కడ అడుగుపెట్టేటప్పుడు అది మరీ చిన్న స్టేషను. ఒక షెడ్డూ, రెండు లైన్లూ, అటూఇటూ ఒత్తుగా చెట్లూ. మండు వేసవిలోకూడ చల్లగా వుండేవి.

సాయంత్రం నాలుగయ్యాక దిగాను. నా బండి రెండు గంటలు లేటు.

స్టేషన్‌లో సిమెంటుతో విశాలంగా కట్టిన పదెనిమిది కట్టడాలు చూసి, ఇదేనా మావూరనే సందేహం కలిగింది. అవు నంటూ రెండుబోర్డులు సందేహాన్ని నివృత్తి చేశాయి.

పదెనిమిది లైన్లు. పాదచారులకి ఓవర్ బ్రిడ్జి. ప్లాట్ ఫారమ్‌నిండా ఈగలు, మనుషులు, సామాన్లు.

ఎలాగో అవతలపడ్డాను.

ఎక్కడా చెట్టు అనేది కనిపించలేదు. ఎండ, చెమట, సిమెంట్ రోడ్ మీద ఎండ ప్రతిబింబం, అన్నీ కలిసి నాకు నన్నే అసహ్యం చేశాయి.

అప్పటి కంకర రోడ్లన్నీ మాయం అయినాయి.

తారురోడ్ల ప్రక్కన ఎలక్ట్రిక్ స్థంభాలు, అప్పటి చెట్లకి బదులు.

"రిక్షాసార్!"

"టాక్సీ"

కలగాపులగంగా, వేడి రోడ్డుమీద మురుగుకాలవల్తో కలిసి గోల. భరింపరాని గోల...

"హోటల్" అన్నాను.

ఒక రిక్షా నాముందుకు తోసుకొచ్చి 'శాంతి భవన్ సార్! ఒకటోరకం!' అన్నాడు.

"పద" అన్నాను. అక్కడనుండి త్వరగా బయటపడాల్సి వుంది. కడుపులో తిప్పుతోంది.

రోడ్లన్నీ అలాగే వున్నాయి. ఊరిలో అప్పటి వందల చెట్లలో ఒక్కటీలేదు. అంతటా ఎలక్ట్రిక్ స్థంభాలు, మురుగు కాలువలు.

హోటలు చేరేను.

"సింగిలా సార్?"

"కాదు డబుల్."

"పదిహేను ఎడ్వాన్స్."

కలలోలాగ జరుగుతోంది అంతా.

గదికి చేరుకుని స్నానం చేశాక కొంచెం ప్రాణం వొచ్చింది.

బేరర్ వచ్చి 'కూల్ డ్రింకు కావాలాసార్' అన్నాడు.

'ఆఁ...ఏముంది?'

'లెమన్-ఆరంజ్-మాంగో-లైమ్‌జ్యూస్-విమ్‌టో-ఇంకా ...ఇంకా...'

'కోకోకోలా ఉందా?'

'లేదు-సార్.'

'పోనీ చల్లటి నిమ్మకాయ నీరు'

ఆశాభంగం పొందినవాడిలాగ వెళ్ళిపోయాడు. అర గంట తరువాత తెచ్చేడు.

ఒక్కసారి త్రాగి గ్లాసు వొదిలాను. అసహ్యంగా ఉంది.

'ఏం సార్ బాగాలేదా?'

'బాగుందిలే-పట్టుకెళ్లి పారబొయ్యి.'

డబ్బిచ్చి పంపేను.

ఇదేనా నాఊరు? నా కళ్లకు జ్ఞాపకం వున్న మాఊరేది?

ఫేన్ పనిచేస్తున్నా గదిలో వేడి.

అరయాక ఊరిలోకి బయలుదేరేను. అన్నని, మా యింటిని ఒక్కసారి చూడాలని ఉంది.

కాని, వీలైనంత వేగం ఇక్కడినుంచి బయటపడాలని వుంది.

ఆ అందవికారపు వీధుల్లో నడిచి నడిచి ఊరవతల నది ఒడ్డుకి చేరాను.

బక్కచిక్కి కుళ్లిపోయిన నది. దుర్గంధం చుట్టూ.

అయినా ఇంకా దగ్గరికి వెళ్లాను.

అక్కడా చెట్లులేవు. ఫేక్టరీలు, చాలా ఇళ్లు, గుడిసెలు- దుర్గంధం-వేడిగాలి.

ఆరోజు శాంతకి అన్యాయం చేసినచోటు గుర్తించలేక పోయాను. బహుశా ఆప్రదేశం ఫేక్టరీ ఆవరణలో వుంది.

లోపలికి వెళ్లాలనిపించలేదు. నాకు కనిపిస్తూనేఉంది. వందల సంవత్సరాలు పెరిగి నీడా, అందమూ ఇచ్చిన చెట్లన్నీ సమూలంగా తీసేశారు.

ఇది నా ఊరుకాదు-దాని స్మశానం. పాడుకల.

వెనక్కి వెళ్లేను. ఆ రోడ్డులోనే శాంత ఇల్లు ఉండేది. అప్రయత్నంగానే శాంత ఇంటిముందు ఆగాను. ఆ ఇల్లు మాత్రం మారలేదు. అప్పటి పెంకుటిల్లే...పెంకులుగాని, సున్నంగాని కొత్తగా పడలేదు. ఇన్ని సంవత్సరాలలోనూ. ఏం

చెయ్యాలో తోచలేదు. చాలా సందేహిస్తూనే రెండడుగులు వేశాను.

"ఎవరు బాబూ?"

ఆయన కష్టంగా కుర్చీలోంచి లేచారు.

అవును. దశరథరామయ్యగారే! శాంత తండ్రి.

"నేనండి. శివరామ్‌ని..."

ఆయన కేమీ బోధపడలేదు. ఇంటిపేరూ, నాన్న పేరూ చెప్పేక, 'ఓ నువ్వా!...రా కూర్చో' అన్నారు.

నులక మంచంమీద జాగ్రత్తగా కూర్చున్నాను. నిమిషంలో నల్లులు కుట్టడం ప్రారంభించేయి.

'ఎక్కడ ఉంటున్నావు? చాలాకాలం అయిపోయింది నీజాడ తెలిసి.'

'బొంబాయిలో.'

'మీ అన్నని చూశావా ?'

'లేదు.'

ఆయన ఆశ్చర్యపోయాడు. సంభాషణ ఇలాగ సాగడం ఇష్టంలేక "మీ అమ్మాయి శాంత-ఆమెకోసం మీ ఇంటికి వచ్చేవాణ్ని. మీకు జ్ఞాపకముందా?" అన్నాను.

అతను ముఖం చిట్లించి "లేదయ్యా!...ఏనాటి మాటో! మీరందరూ పట్నాలు వెళ్లిపోయారు, అది నలుగురుపిల్లలతల్లి."

అని కూర్చుని "శాంతా! మంచినీళ్లుతే! ఎవరొచ్చారోచూడు!" అన్నారు దశరథరామయ్యగారు. నేను ఆశ్చర్యపడ్డాను... శాంత!

శాంత వొచ్చింది. అవును-ఆమే! నలభై దాటినట్టుంది మనిషి. అప్పటి అందంకాని, కాంతిగాని చిన్నెలుగాకూడా లేవు. జీవితంతో పోరాడి, ఆశ వొదులుకున్నట్టుగావుంది కాని, ఆమె శాంత. పోలికలు పూ_ర్తిగా పోలేదు.

నన్నుచూసి ఆమె గుర్తుపట్టలేకపోయింది.

'ఎవరు నాన్నా?' అంది.

'శివరామ్. నీకు జ్ఞాపకంలేదూ? వాళ్ళ అన్నదగ్గరికి కూడా వెళ్ళకుండా యిక్కడికి వొచ్చాడు!...మంచినీళ్లు తాగు, శివరామ్!'

'ఒద్దండీ-నన్ను మర్చిపోయావా శాంతా?' అన్నాను దిగాలుగా, భయంగా.

'చాలాకాలం ఐందిగా. ఓ! అవును కొంచెం కొంచెం జ్ఞాపకం వొస్తూంది. ఎమ్మే చదివి, తరువాత వొచ్చి ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళిపోయావుకాదూ! అయినా ఏనాటిమాట! అంది శాంత నిర్వికారంగా.

"అవును...మరి నువ్వు-"

ఆమె జవాబు చెప్పేలోగా, చేతికర్ర తీసికొని దశరథ రామయ్య, "ఓ సారి అలా తిరిగివొస్తాను. మళ్ళీ కనిపిస్తావుగా!" అని బయటికి వెళ్లేరు.

"వొచ్చేటప్పుడు పొట్లంలో పంచదార తే నాన్నా!" అంది శాంత.

ఇద్దరమూ నిలబడ్డాం.

'నా మాట అడిగావా... పెళ్ళి... ఆయన జిల్లా పరిషత్తులో టీచరు. నలుగురు పిల్లలు. చంటిది నిద్రపోతోంది. వాళ్లు ముగ్గురూ ఆటలకి వెళ్లేరు. నీ కెంతమంది!" అంది శాంత.

"లేరు" అన్నాను.

"పాపం!" అంది శాంత. "ఉద్యోగం ఏమిటి ?"

'ఏదో కంపెనీలో'.

'పెద్ద ఉద్యోగమేనా ?'

"గడిచిపోతుందిలే. మీకు ?"

"వెడుతోంది. రాత్రిదాకా ట్యూషన్లు చెబుతూనే వుంటారాయన".

రెండు నిమిషాలు అలాగే గడిచిపోయాయి.

"నేను- ఆ రోజులు ఏమీ జ్ఞాపకం లేవా శాంతా ?" అన్నాను.

'చెప్పేనుగా కొంచెం కొంచెం...'

"నువ్వు నూతిలోపడ్డం..."

'ఓ అదా! వర్షంలో నీరు తోడబోతుంటే కాలుజారింది, చిన్న నుయ్యే. పది నిమిషాల్లో బయటపడ్డాను. నీ కింకా జ్ఞాపకం ఉందా ?'

'ఉంది... ఆ తొలిరోజు—'

"ఏమిటి ?"

"ఏం జరిగిందో జ్ఞాపకం ఉందా ?"

ఆమె ఆలోచిస్తూన్నట్లు ముఖం చిట్లించి 'ఏం జరిగింది? నా కేం జ్ఞాపకం లేదు' అంది.

ఇంతట్లో లోపలినించి చంటిపిల్ల ఏడుపు.

"మళ్ళీరా శివరామ్" అంది శాంత వెళ్ళబోతూ.

"ఒక్క నిమిషం" అన్నాను.

శాంతకి ఆగక తప్పలేదు.

జేబులోనుంచి రెండు వందనోట్లు తీసి "పిల్లల కేమైనా కొను" అన్నాను ఆమె చేతికిస్తూ.

ఆమె త్వరగా నోట్లు చీరలో దాచి, "ఎవరికీ చెప్పకు" అంది. గుండెల్లో దేవినట్టయింది నాకు

"అలాగే" నన్నాను. లోపలినించి ఏడుపు ఉధృతం కాసాగింది.

"ఉంటాను శివరామ్! మళ్ళారా" అంది శాంత లాంఛనంగా.

కథా నిలయం
883
శ్రీకాకుళం

"అలాగే."

బయటికి వొచ్చి రిక్షాలో హోటల్ చేరుకున్నాను.

ఆ రాత్రి జ్వరం.

పదిహేను సంవత్సరాలు మోసిన భారం గుండెలోనించి తీసేసిన తేలికకన్న, ఆ స్థానంలో వొచ్చిన నల్లటి శూన్యం నన్ను ఎక్కువగా బాధించింది. జ్వరంలో కలలు-విచిత్రంగా.

మూడో రోజుకి నయం ఐంది. ఆ వెలితి మాత్రం గుండెల్లో కొత్త బరువుగా వుండిపోయింది. శాంత అదంతా పూర్తిగా మరిచిపోవడం ముల్లులాగా గుచ్చుకుంటోంది. ఉండి ఉండీ నా మనస్తత్వం నాకే అర్థంకాలేదు.

ఆ రోజు బయలుదేరి మూడో రోజుకి కలకత్తా చేరుకున్నాను.

ఆ రోజూ, తరువాత రెండురోజులూ వసంతకు ఫోన్ చేశాను. ఆమె ఇంట్లో ఉండటమేలేదు. ప్రతి నిమిషానికి నా తపన ఎక్కువయిపోతోంది.

నాలుగో రోజు సాయంత్రం ఆమె వొచ్చింది.

నన్ను చూస్తూనే "రామ్! ఏమయింది? అలా ఎందుకున్నావ్?" అంది కంగారుగా.

"ఏమిటి?" అన్నాను.

"ఒక్కసారి ముసలితనం వొచ్చేసింది నీకు" అంది నవ్వుతూ. వసంత దూరంగా కూర్చుని. "ఎప్పుడు వొచ్చావు?" అంది.

"నాలుగు రోజులైంది. నీకు రోజూ ఫోన్ చేస్తూనే వున్నాను."

'అవునట - తెలిసింది... నిమిషం వొదల్లేదు హరీష్. ఇవాళ ఉదయం పనిమీద బొంబాయి వెళ్లేడు- నువ్వు ఫోన్ చేశావని తెలిసి వొచ్చాను...ఏమైంది."

అంతా చెప్పేను.

అంటే ఆ అనుభవం నాకు కలిగించిన ఈ వెలితీ, బాధా తప్ప అంతా.

విని, వసంత చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయింది. నా వైపు ఎంతోసేపు పరీక్షగా చూసింది.

'ఏమిటది వసూ?' అన్నాను-ఆ నిమిషాలవేడికి తాళలేక.

'ఏమీలేదు రామ్... నువ్వు చాలా మారావు' అంది వసంత బాధగా.

'నీ కోసం సిద్ధంగా వున్నాను వసూ... మన మధ్య ఇంకేమీ లేదు !' అన్నాను లేస్తూ.

అమెకూడా లేచింది. గడియారం చూచుకుని, 'వెళ్తాను శివరామ్!...నాన్నగారు త్వరగా రమ్మన్నారు...' అంది.

"మళ్ళీ ఎప్పుడు వొస్తావు ?"

'ఫోన్ చేస్తాను...'

మరొకసారి నా వైపుచూసి ఆమె వెళ్ళిపోయింది. ఏమీ అర్థంకాలేదు నాకు.

అద్దం చూసుకున్నాను.

నిజంగానే... బాగా వయసు వొచ్చినవాడిలాగ కని పిస్తున్నాను! అప్పటి యవ్వనంలేదు ముఖంలో.

జ్వరంవల్ల అనుకున్నాను. కాని నాకు భయం వేసింది. ఏమైపోయాను అప్పటి నేను ?

గంటసేపు ఆందోళనగా గడిపాను. తరువాత తొందరగా నిద్రపోయాను.

*　　*　　*

వారం తరువాత ఒకసాయంత్రం వసంత టెలిఫోన్ చేసింది. ఆ బంగారు గొంతుక నాకు ఒక్కసారి ఆనందాన్ని ఇచ్చింది. ఎంత ఆత్రతతో ఎదురుచూశాను, అది వినడానికి.

కాని ఆ సంభాషణ...

వివరాలను ఎలాగ మళ్లీమళ్లీ జ్ఞాపకం తెచ్చుకోను? పది నిమిషాలు సాగిన ఆ హృదయవిదారక సంభాషణ తాత్పర్యం ఎలా మరచిపోను?

ఆమె నా క్షమ కోరుకుంది.

నాకూ ఆమెకీ దాంపత్యం కుదరదని ఆమె గ్రహించింది. అంతా నేను మరచిపోవాలి...ఆమె మూర్ఖత్వాన్ని విస్మరించి, ఆమెని క్షమించాలి.

"ఏమయింది వసూ?"

"చెప్పలేను శివరామ్!...నాకన్న అతీతశక్తులు నా ప్రవర్తనను నిర్ణయిస్తున్నాయి. నేను నిన్ను భర్తగా అంగీకరించలేను. అది నిజం..."

"ఏమనేది? ఏం చేసేది?"

"క్షమించు...ఆశీర్వదించు"

"ఎందుకని?"

"నాన్నగారు బలవంతం చేసి హరీష్‌నీ, నన్నూ ఒప్పించారు...వొచ్చే గురువారం పెళ్లి..."

ఏమనేది? ఏం చేసేది?-ఆమెని మనస్ఫూరా ఆశీర్వదించడం తప్ప?

చీకటి పడుతోంది.

నౌకర్ని పిలిచి స్కాచ్ కోసం పంపేను.

పది నిమిషాలు అటూఇటూ ఆలోచించి ఆశకి టెలిఫోన్ చేశాను.

ఆమె ఇంట్లోనే వుంది.

"ఆశా? వెంటనే రాగలవా?"

రెండు క్షణాలు ఆలోచించింది ఆశ.

"అలాగే...అంది.

"నీకోసం ఎదురు చూస్తాను."

"వొస్తాను"

నీరసంగా ఫోన్ పెట్టేసి, ఆమెని ఆశీర్వదించాను. ఆశని మనసారా.

